Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03




నెల్లూరు, 01.11.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 22 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## గోదావరి... కృష్ణ... పెన్నా...

# సంగమ సంబరం



- సాగునీటి పనులకే పెద్దపీట - రైతన్నకు రాజబాట
- దివంగత నేత వై.యస్. ప్రారంభించిన జలయజ్ఞంలో కొత్త శకం
- మూడు నదుల అనుసంధానంతో నవ్యాంధ్రకు స్వర్ణయుగం
- తెలంగాణతో సంబంధం లేకుండా నీటి మళ్లింపుపై కొత్త ప్రణాళిక

*జలయజ్ఞం... ఈ పేరు వినగానే తెలుగు ప్రజలకు గుర్తొచ్చే మహానాయకుడు దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి. 2004-2009ల మధ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన జలయజ్ఞం ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు పునాది వేసింది. బంజరు భూములను సైతం బంగరు భూములుగా మార్చింది. రిజర్వాయర్‌ల నుండి మారుమూల పొలాలకు సైతం నీళ్ళు అందేలా కాలువలు తవ్వింది. జలయజ్ఞం తెలుగు రాష్ట్రాల రైతుల పాలిట వరమైంది. ప్రతి ఎకరా పండింది. ప్రతిరైతు ఇంట ఆనందం నిండింది. ఆంధ్రారైతుల గుండెల్లో వై.యస్.ను అపర భగీరథుడిగా నిలిపింది.*

ఆనాడు వై.యస్. చేపట్టిన జలయజ్ఞం స్ఫూర్తితో ప్రస్తుత ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సాగునీటి వనరుల విషయంలో మరో ముందడుగు వేస్తున్నాడు. గోదావరి, కృష్ణ నదుల నుండి సముద్రానికి తరలిపోయే వృధా జలాలను రాష్ట్ర ప్రయోజనాలకు వాడుకునే బృహత్‌ప్రణాళికలు రచిస్తున్నాడు. ఆయన కృషికి వరుణదేవుడు కూడా పూర్తి స్థాయిలో ఆశీస్సులందిస్తుండడంతో జలయజ్ఞం-2ను భారీ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడానికి నవ భగీరథుడిలా జగన్ సంకల్పించాడు.

(మిగతా 11వ పేజీలో)



## ప్రతిపక్ష హోదా..

11లో

# ఉండేనా? ఊడేనా?

- వైసిపిలోకి మొదలుకానున్న టిడిపి ఎమ్మెల్యేల వలస
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే పార్టీలోకి ఎంట్రీ
- బాబు ప్రతిపక్ష నేత హోదాకు పొంచివున్న గండం
- చేరికలలోనూ విలువలు పాటిస్తున్న సీఎం జగన్



## 6వ వర్ధంతి



అనురాగమూర్తి... ఆత్మీయదీప్తి...

## అమ్మ

ఆమె ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి
ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి

కుమారుడు
**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
రాజ్యసభ సభ్యులు

**కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ గారు**

నిర్యాణం: 01-11-2013

• నిండిన సోమశిల

# దశాబ్దాల కల... నెరవేరిన వేళ

- చరిత్రలో రికార్డు స్థాయి నీటి మట్టం
- 78 టిఎంసీలతో నిండుకుండలా సోమశిల
- ఆనందం వ్యక్తం చేసిన నీళ్ళ మంత్రి అనిల్

నెల్లూరుజిల్లా ప్రజలకు అమృతవర్షిణి లాంటి సోమశిల రిజర్వాయర్ మూడున్నర దశాబ్దాల చరిత్రలో ఒక రికార్డును సృష్టించింది. ఈ రిజర్వాయర్‌ను ప్రారంభించిన తర్వాత తొట్టతొలిసారిగా పూర్తిస్థాయిలో 78 టిఎంసీల నీటి మట్టానికి చేరుకుంది. బుధవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో ఈ అద్భుతం ఆవిష్కృతమైంది. సోమశిలలో నీళ్లు 78 టిఎంసీల సూచీని తాకాయి. స్వర్గీయ నందమూరి తారక రామారావు, స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిల కృషి ఫలితం ఈ సోమశిల రిజర్వాయర్. ఒకప్పుడు 50టీఎంసీలకు మించి నీటిని నిల్వచేసే పరిస్థితి వుండేది కాదు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో సోమశిలలో పూర్తి స్థాయి నీటిమట్టం నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టారు. త్వరితగతిన భూసేకరణ సమస్యలను పరిష్కరించారు. ఆయన హయాంలో సోమశిలలో 73 టిఎంసీల వరకు నీళ్ళను నిలబెట్టడం జరిగింది.

నీళ్ళు, వరదలు, వర్షాల విషయంలో రికార్డులు సృష్టించాలన్నా, ఆ రికార్డులను బద్దలు కొట్టాలన్నా వై.యస్. కుటుంబానికే చెల్లినట్లుంది. వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008లో సోమశిలలో అత్యధికంగా 73 టీఎంసీలను నిల్వ చేస్తే, ఇప్పుడు ఆయన తనయుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో గత రికార్డును అధిగమిస్తూ పూర్తిస్థాయిలో 78 టిఎంసీలను నిలబెట్టారు.

బుధవారం మధ్యాహ్నం సోమశిలలో 78 టిఎంసీల నీటిమట్టం చేరిందనగానే అమరావతిలో వున్న జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఆనందానికి పట్టపగ్గాల్లేవు. తాను ఇరిగేషన్ మంత్రిగా వుండగా, తన హయాంలో సోమశిలలో పూర్తిస్థాయి సామర్థ్యంలో నీటిని నిల్వచేయడం తన అదృష్టంగా చెప్పుకొచ్చారు. మొత్తానికి సోమశిలలో 78 టిఎంసీల నీళ్లను చూడగలమా? అన్న ప్రశ్నకు అనతికాలంలోనే సమాధానం లభించడం విశేషం!

## కండ్లేరుకు మహర్దశ!

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కృష్ణానదికి రెండు నెలల కాలంలో ఏడుసార్లు వరద ప్రవాహమొచ్చింది. తెలుగుగంగకు అన్నిసార్లు కూడా నీళ్లు వదిలారు. సోమశిల రిజర్వాయర్ 78టిఎంసీలతో పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. శ్రీశైలం నుండి ఇన్నిసార్లు, ఈ స్థాయిలో నీళ్లు వదులుతున్నా జిల్లాలోని కండ్లేరు రిజర్వాయర్ నిండక పోవడంపై ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇటీవల ఇరిగేషన్‌పై సీఎం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో కండ్లేరు రిజర్వాయర్ ఇంకా నిండలేదనే విషయాన్ని జగన్ తెలుసుకున్నాడు. కండ్లేరు సామర్థ్యం 68టిఎంసీలు



కాగా ఇంతవరకు 30టిఎంసీలు మాత్రమే చేరాయి. అది నిండడానికి ఎందుకు ఆలస్యమవుతుందని ముఖ్యమంత్రి అధికారులను ఆరా తీశారు. సోమశిల నుండి కండ్లేరుకు నీటిని తీసుకెళ్లే కాలువ సామర్థ్యం 10వేల క్యూసెక్కులేనని, అంతకుమించి నీటిని విడుదల చేసే పరిస్థితి లేదని అధికారులు చెప్పడంతో, వరదల సమయంలో మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవాలంటే సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లను వేగంగా నింపాల్సి వుంటుందని, అందుకని సోమశిల నుండి కండ్లేరుకు అధిక సామర్థ్యంతో మరో కాలువను తవ్వాలని ముఖ్యమంత్రి సూచించాడు. అలాగే సోమశిల నుండి రాళ్లపాడు వరకు ఎన్నో చెరువులకు నీళ్ళందించే ఉత్తర కాలువ సామర్థ్యాన్ని కూడా పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించడం జిల్లా రైతాంగంలో ఆనందం నింపింది.



సింహపురి సమాచారం

## రైతన్నకు ముందే సంక్రాంతి

- రైతు భరోసాతో ఆసరా
- పుష్కలంగా సాగునీళ్ళు

గత నాలుగేళ్లుగా చినుకు లేక కడుపుకు మెతుకు లేక కంటి మీద కునుకులేక, భూములతో పాటు తమ డొక్కలనూ ఎండబెట్టుకున్న అన్నదాతలకు చాలారోజుల తర్వాత మంచిరోజులొచ్చాయనిపిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణం రైతాంగానికి వెన్నుదన్నుగా వుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన రైతుభరోసా ఆర్థికంగా రైతుకు కొంత ఊరడింపే. అందుకు తగ్గట్లుగా... వాతావరణ పరిస్థితులు జిల్లా రైతాంగానికి ఎంతో అనుకూలంగా మారాయి. జిల్లా రైతాంగానికి వరప్రసాదిని అయిన సోమశిల రిజర్వాయర్ రికార్డు స్థాయిలో 78 టిఎంసీల పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. జిల్లాలో రెండో పెద్ద రిజర్వాయర్ కండలేరు క్రమక్రమంగా నిండుతోంది. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులను నీటితో నింపుతున్నారు. జిల్లాలో 8.60 లక్షల ఎకరాలకు సాగునీళ్ళు అందించాలని ఐఏబి సమావేశంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయించింది. అనధికారికంగా వేసే పంటతో ఎటు లేదన్నా ఈసారి 10లక్షల ఎకరాల వరకు నాట్లు పడతాయి. ఈసారి ఒక పంటే కాదు, రెండో పంటకు సైతం రైతులు ఉత్సాహంగా ఉన్నారు.

డెల్టాలోనే కాదు, మెట్టలోనూ ఈసారి కొంత ఆశాజనక వాతావరణం కనిపిస్తోంది. గత నెలతో పాటు ఈ నెలలోనూ విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. మెట్టప్రాంతాలలో పంటలకు వర్షాలే ఆధారం. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో మెట్టప్రాంతాలలో మినుము, పెసర, వేరుశెనగ, పొగాకు వంటి పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

## రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ విజేతలు

నెల్లూరులోని లిటిల్ ఏంజిల్స్ క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు గత నెల 26న ముగిశాయి. రైఫిల్ షూటింగ్ మూడు విభాగాల్లో జరుగగా అన్ని విభాగాల్లో గుంటూరు ఛాంపియన్‌గా నిలిచింది. ఓపెన్ సైట్ బాలుర విభాగంలో ప్రశాంత్‌రెడ్డి (కర్నూలు), ఎస్‌కె సాజిద్ బాషా (నెల్లూరు), సాహిల్ శ్రీచందన్ (కడప) గెలుపొందారు. బాలికల విభాగంలో నిఖిత సంతోషి (కర్నూలు), తేజస్వినీ (కర్నూలు), అజ్మియా అంజుమ్ (నెల్లూరు) గెలిచారు. పీప్ సైట్ బాలుర విభాగంలో ఉమామహేశ్వర్ (కృష్ణా), భానుప్రణీత్ (గుంటూరు), సాయిదీప్ (వైజాగ్) గెలుపొందారు. బాలికల విభాగంలో భువిత (కృష్ణా), మేఘన (కృష్ణా), శ్రీ గాయత్రి రెడ్డి (గుంటూరు) గెలిచారు. పిస్టల్ బాలుర విభాగంలో ముకేష్ (గుంటూరు), యశ్వంత్‌రెడ్డి (గుంటూరు), అభిషిక్త్ (గుంటూరు) బాలికల విభాగంలో మౌలిక (వైజాగ్), సాయిశృతి (వైజాగ్), సన్విత షారూన్ (గుంటూరు) విజయం సాధించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకట్, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ డైరెక్టర్ చాట్ల రాజేష్, టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి ఎం. చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నేతలు విక్టర్, థామస్ పీటర్ పాల్గొన్నారు.

## జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-19 బాస్కెట్‌బాల్ జిల్లా బాలుర జట్టును గతనెల 29న ఎంపిక చేశారు. నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ ఎంపికలు జరిగాయి. జిల్లా జట్టులో కె.ఆశ్రిత్, ఎం.హనిత్‌రెడ్డి, టి.కార్తీక్‌రెడ్డి, ఎం.శశి, ఎం.సాయిభరత్, ఎన్ నాగేంద్ర, ఎల్.రెడ్డి చరణ్, ఎల్.హేమంత్, ఎస్.వెంకటేశ్, ఎస్‌కె సమీర్, ఎస్‌కె సోహెల్ ఎంపికయ్యారని, వీరు తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని క్రీడాసమాఖ్య కార్యదర్శి పి.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. డిఎస్ఏ చీఫ్‌కోచ్ ఆర్‌కె యతిరాజ్, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గాదం శ్రీనివాసులు, చీఫ్‌కోచ్ పి.డి ఎం. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకాసురుల భరతం పడతాం

**- నోడల్ అధికారి సదాభార్గవి**



జిల్లాలో ఇసుక అక్రమరవాణా జరగకుండా ప్రత్యేకదృష్టి సారించి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని, ఇటీవల అక్రమ రవాణాకు పాల్పడుతున్న 8 వాహనాలను పట్టుకున్నామని తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్, ఇసుక అక్రమరవాణా నిరోధక నోడల్ అధికారి శ్రీమతి సదా భార్గవి వెల్లడించారు. గతనెల 27న నెల్లూరులోని భూగర్భ గనులశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఇసుక స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేయకుండా నిరోధించడానికి పటిష్టమైన నిఘా ఏర్పాటుచేశామన్నారు. నవంబరు 5వతేదీ వరకు అన్ని చెక్‌పోస్టుల వద్ద గట్టినిఘా ఉంచి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. జిల్లాలో తనిఖీలు నిర్వహించేందుకు నాలుగు సంచార బృందాలు ఏర్పాటు చేశామని, తెలుగుగంగ ప్రత్యేక ఉపకలెక్టర్లు రాజశేఖర్, వెంకటేశ్వర్లును రెండు బృందాల వంతున పర్యవేక్షణ అధికారులుగా నియమించామన్నారు. వీరికి అనుసంధాన కర్తగా తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్ పి.ఏ, మరో ప్రత్యేక కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మిని నియమించామని చెప్పారు. ఒక్కో బృందంలో గనులు, రవాణా, పోలీసుశాఖల నుండి ఒక్కో అధికారి వంతున విధులు నిర్వహిస్తారన్నారు. అంతేకాక, తడ వద్ద ఉన్న ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు కాకుండా అదనంగా 6చోట్ల తాత్కాలిక చెక్‌పోస్టులను గత నెల 26వ తేది నుండి ప్రత్యేకంగా ఏర్పాటుచేసి నిఘాను పటిష్టం చేశామని పేర్కొన్నారు. అందులో వెంకటగిరి-ఏర్పేడు, తడ-శ్రీసిటీ, మేనకూరుసెజ్, నెలబల్లి, నాయుడుపేట, శ్రీకాళహస్తి, జొన్నవాడ, బద్వేలు, విరువూరు, పొదలకూరు మార్గాల్లో ఇసుక అక్రమంగా తరలిపోకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో చెక్‌పోస్ట్‌లో మార్కెటింగ్, రెవెన్యూ, పోలీసు, గనులశాఖ అధికారులను నియమించి సిట్టింగ్‌స్క్వాడ్ రూపంలో 24గంటలూ నిఘా ఉంచి తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడా అక్రమరవాణా జరగకుండా నిరోధిస్తామన్నారు.

## వెల్లంటి హైస్కూల్‌లో మొక్కలు నాటారు

నెల్లూరురూరల్ వెల్లంటి హైస్కూల్‌లో సోమవారం ప్రధానోపాధ్యాయుడు డి.జయరామనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు నిమ్మ, కొబ్బరి వంటి మొక్కలు నాటారు. ప్రతిరోజూ వాటికి నీళ్లు పోసి సంరక్షిస్తామని విద్యార్థులు ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, ప్రసాద్, పద్మజ, శివకుమార్, అరుణ్, సంధ్యారాణి, జగదీష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

## ఆల్తూరు గిరీష్‌రెడ్డి సారధ్యంలో

# శివమాల ధారణ

నెల్లూరు, మూలాపేటలోని భ్రమరాంబ సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం నందు ప్రతి ఏటా కార్తీక మాసంలో ఆ దేవస్థానం మాజీఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శివదీక్ష మాలధారణలు ఎంతో భక్తితో జరుగుతుంటాయి. కార్తీకమాసం ప్రారంభమైన నేపథ్యంలో ఈ ఏడాది కూడా అక్టోబర్ 30వ తేదీన ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 250మంది శివ భక్తులు శివమాల దీక్ష ధారణ చేపట్టారు. నవంబర్ 25వ తేదీ వరకు భక్తులు శివదీక్ష



కొనసాగిస్తారు. శివదీక్ష మాలధారణ చేసిన ప్రతి భక్తునికి మాల, దీక్షా వస్త్రాలను ఆల్తూరు గిరీష్‌రెడ్డే ఉచితంగా సమకూర్చాడు. అలాగే ప్రతిరోజూ ఉచితంగా అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆల్తూరు గిరీష్‌రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని, శివునికి అత్యంత ప్రీతిపాత్రమైనదని, ఈ మాసంలో శివమాల ధరించి ఆ పరమశివుని నియమనిష్టలతో ప్రార్థించడం ఎంతో అదృష్టంతో కూడుకున్నదన్నాడు. కార్తీకమాసం చివరి ఏడురోజులు దేవస్థానంలో పంచాక్షరి అఖండ భజన జరుగుతుందని, 25వ తేదీ కార్తీకమాసం ముగింపురోజున రంగనాథస్వామి దేవస్థానం వద్ద పెన్నా నది నుండి సేకరించిన 12 కలశాల జలంతో మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంకు భక్తులతో వూరేగింపు జరుగుతుందని, 26వ తేదీన ఆ జలంతో శివుడికి అభిషేకం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## జివికెకి భారీ నిధులు

GVK

# 7,614 కోట్ల పెట్టుబడి



- ముందుకొచ్చిన విదేశీ కంపెనీలు
- జివికె ఎయిర్‌పోర్టులుగా కొనసాగనున్న ముంబై విమానాశ్రయాలు

*కార్పొరేట్ వ్యాపార రంగంలో పెట్టుబడిదారులకు కావలసింది నమ్మకం. తాము పెట్టుబడి పెట్టబోయే సంస్థపైనా, సంస్థ యాజమాన్యంపైనా బలమైన విశ్వాసం, వీరిని నమ్మి ఎన్ని వేలకోట్లైనా పెట్టవచ్చున్న ధైర్యం చాలా అవసరం. అలాంటి భరోసానే ఇప్పుడు జివికె సంస్థ పెట్టుబడిదారులకు కల్పించింది. తమను నమ్మి 7,614కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేలా విదేశీ కంపెనీలను తమ సమర్ధతతో ఆకర్షించింది. భారతీయ కార్పొరేట్ వ్యాపార రంగంలో జివికె సంస్థ సంచలనంగా నిలిచింది.*



జివికె ఎయిర్‌పోర్టు హోల్డింగ్స్‌లో 79.1శాతం వాటాని 3 విదేశీ సంస్థలు కలిసి 7,614 కోట్ల రూపాయలకు కొనుగోలు చేశాయి. 20.9శాతాన్ని తమ వద్ద వుంచుకుని మిగిలిన 79.1శాతాన్ని విదేశీ పెట్టుబడిదారులకు విక్రయించి అతిపెద్ద మొత్తంలో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకట్టుకున్న సంస్థగా జివికె నిలిచింది. జివికె తీసుకున్న ఈ అనూహ్య నిర్ణయం ద్వారా వచ్చే మొత్తంతో తమపై వున్న రుణభారాన్ని తగ్గించుకుని, ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ సంస్థ ద్వారా ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తన వాటాను పెంచుకోవడానికి సంసిద్ధమౌతోంది. ముంబై ఎయిర్ పోర్టులో 23.5శాతం వాటా కలిగివున్న మిడ్‌వెస్ట్, ఎయిర్‌పోర్ట్స్ కంపెనీ సౌత్‌ఆఫ్రికా అనే రెండు సంస్థల నుండి వాటాను జివికె సంస్థ కొనుగోలుచేసి తన ఆధి పత్యాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇక నుండి ముంబై ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుతో







పాటు నవీ ముంబైలో కొత్తగా నిర్మితమౌతున్న మరో ఎయిర్‌పోర్టు కూడా జివికె ఎయిర్‌పోర్టులుగానే ప్రఖ్యాతిచెందనున్నాయి.

జివికె సంస్థకు చెందిన "ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్" ఈ రెండు ఎయిర్‌పోర్టుల నిర్వహణలో కీలక పాత్ర పోషించనుంది.

జివికె సామర్థ్యాన్ని, సంస్థ సమర్ధతను అంచనావేసిన విదేశీ సంస్థలు ఎడిఐఎ (అబుదాబి ఇన్‌వెస్ట్‌మెంట్ అథారిటి), పియస్‌పి ఇన్‌వెస్ట్‌మెంట్స్ (పబ్లిక్ సెక్టర్ పెన్షన్ ఇన్‌వెస్ట్‌మెంట్ బోర్డు)తో పాటు ఎన్‌ఐఐయఫ్(నేషనల్ ఇన్‌వెస్ట్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బోర్డు) సంస్థలు జివికె సంస్థలలోని వివిధ విభాగాలలో 7,614 కోట్ల అధిక మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టడానికి ముందుకు వచ్చి అక్టోబర్27న ఆదివారంరోజు పరస్పర అంగీకారం చేసుకుని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నాయి.

### ప్రతిష్టాత్మక విమానాశ్రయాలుగా

### జివికె ఎయిర్‌పోర్టులు

భారతదేశం వ్యాపార రాజధానిగా పిలువబడే ముంబైలో ప్రస్తుతం వున్న అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటుగా శరవేగంగా నిర్మాణం జరుపుకుంటున్న నవీముంబై ఎయిర్‌పోర్టుతో కలిపి ఈ రెండు జివికె ఎయిర్‌పోర్టులుగానే పిలువబడతాయి.

భారతదేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు విదేశీపెట్టుబడులను ఎక్కువ స్థాయిలో ఆకర్షించాలన్న ప్రధాని మోడీ పిలుపు మేరకు వ్యాపార వాణిజ్య మంత్రిత్వ శాఖ చేస్తున్న కృషికి ఇలాంటి పెట్టుబడులు మరింత ఉత్సాహాన్నిచ్చి ప్రోత్సహిస్తాయని కార్పొరేట్ వ్యాపార నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇంత పెద్ద మొత్తం విదేశాలనుండి భారతదేశానికి రావడం భవిష్యత్ పెట్టుబడిదారులకు స్ఫూర్తిని కలిగించడమే కాకుండా భారీపెట్టుబడులతో భారత దేశ ఆర్థిక స్థితి మరింత పరిపుష్టం కావడానికి ఈ పెట్టుబడులు సూచికగా మారనున్నాయన్నది వారి అంచనా.

ఇంత భారీస్థాయిలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించి తమ సంస్థను పురోగమనం వైపు పయనింపచేయడానికి కృషిచేస్తున్న సంస్థ సారధులు ఎగ్జిక్యూటివ్ ఛైర్మెన్ జివికె రెడ్డిని, మేనేజింగ్ డైరెక్టర్ జివి సంజయ్‌రెడ్డిని మరియు జి.వి.కె.రెడ్డి మనుమడు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణ రాంభూపాల్‌ని వ్యాపారవర్గాలు అభినందనలతో ముంచెత్తాయి. ఈ ముగ్గురి సమిష్టి కృషితోనే జివికె ఎయిర్‌పోర్ట్స్ అంతర్జాతీయ స్థాయిలో విశిష్టఖ్యాతిని పొందుతుండడం విశేషం. భారతదేశ వ్యాపార రంగంలో దిగ్గజాలుగా రాణిస్తూ ప్రపంచస్థాయి సంస్థలను ఆకట్టుకునే స్థాయిలో తమ ప్రతిభాపాటవాలను కనపరుస్తున్న తండ్రీ కొడుకులు నెల్లూరీయులు కావడం ప్రతి నెల్లూరీయుడు గర్వించదగ్గ విషయం.

ఆల్ ది బెస్ట్ టు జివికె గ్రూప్!...

# ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పం

**- ఇసుక తవ్వకాలపై వైఎస్సార్సీపి నేత రామ్**



ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, అందుకే నిబంధనల మేరకే ఇసుక తవ్వకాలను ప్రభుత్వం అనుమతిస్తోందని, ఇసుక విక్రయాల పట్ల కూడా దృష్టి సారించి, ఎక్కడా ఇసుక అక్రమ రవాణా జరగకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చిందని వైఎస్సార్సీపి బాపట్ల, ఒంగోలు పార్లమెంటరీ నియోజవర్గాల పరిశీలకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గత నెల 26న వాకాడులో నీటిపారుదల, గనుల శాఖ అధికారులు, ఇసుక కాంట్రాక్టర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇసుక తవ్వకాలపై స్థానికుల నుంచి వచ్చిన అభ్యంతరాలను రామ్ ఈ సందర్భంగా పరిశీలించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వర్ణముఖి నది పరిసర ప్రాంతాల్లో ఉన్న రైతులకు, ప్రజలకు మేలు చేకూరేలా ఇసుక తవ్వకాలతో పాటు అమ్మకాలు నిర్వహించేందుకు కృషిచేస్తామన్నారు. స్వర్ణముఖి బ్యారేజ్ లోతట్టు ప్రాంతంలోని ఇసుకమేటను తవ్వి తరలిస్తే అటు బ్యారేజ్‌లో నీటిమట్టం పెరగడంతో పాటు ప్రజల అవసరాలకు కూడా ఇసుక ఉపయోగపడుతుందని, ఈ విషయాన్ని తాను ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా ఆమేరకు ఇసుక తవ్వకాలకు అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. స్వర్ణముఖి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల అవసరాలకు ప్రభుత్వ ఇసుక యార్డ్ నుంచి ఇసుకను ట్రాక్టర్, టైరుబండ్లతో కొనుగోలు చేసేవారికి రాయితీ కల్పించేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా కండలేరు డ్యామ్ నుంచి స్వర్ణముఖి బ్యారేజ్‌కి సరిపడా నీటిని తీసుకువచ్చేందుకు నీటిపారుదల మంత్రితో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


## ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



నెల్లూరు వి.ఆర్. కళాశాలలో 35 సంవత్సరాలు
ఫిజిక్స్ విభాగం అధ్యాపకులుగా మరియు హెడ్‌గా సేవలందించి,
31.10.2019న ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేసిన
డాక్టర్ మర్మావుల సుబ్రహ్మణ్యం గారికి
శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు తోడ్పాటునందించిన
వారి ధర్మపత్ని శ్రీమతి రజని గారిని అభినందిస్తూ...
వారి భావి జీవితం సుఖసంతోషాలతో మరియు
పరిపూర్ణ ఆరోగ్యంతో సాగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు : ఎమ్.రామచంద్ర కాశ్యప్, Soft. Eng. California, USA
కోడలు : ఎమ్.వి.ఎన్.నిఖిత
కుమార్తె : ఎమ్.అనన్య, Paskon Information Systems, Bangalore

## 'ప్రభా'తం

# కాంగ్రెస్ బుద్ధి మారేనా?

**ఒకప్పుడు కాంగ్రెస్‌ను ఎదుర్కోవడానికి దేశంలోని అన్ని పార్టీలు ఏకమయ్యేవి. ఇప్పుడు బీజేపీని ఎదుర్కోవడానికి కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలు ఏకం కావాల్సి వస్తోంది. ఈ పరిస్థితులు చేజేతులా కాంగ్రెస్ కల్పించుకున్నవే! కాలంతో పాటు ఆలోచనలు, ధోరణి మారాలి. విధానాలు, సిద్ధాంతాలు మారాలి. ఈ విషయంలో బీజేపీ వేగాన్ని కాంగ్రెస్ అందుకోలేకపోయింది. కాంగ్రెస్ ముందుగా తనను తాను సంస్కరించుకుని మెజార్టీ ప్రజల మనసులకు మళ్లీ దగ్గరకాగలిగితే పతనం అంచుల నుండి మళ్లీ వెనక్కి మళ్లీ రాజకీయంగా పరుగు అందుకోగలదు.**

ప్రజాస్వామ్య వ్యవస్థలో బలమైన ప్రతిపక్షం లేకపోవడం నియంతృత్వానికి దారితీస్తోంది. బలమైన ప్రభుత్వం ఎలా వుండాలని కోరుకుంటామో, ప్రభుత్వం తప్పులు చేసినప్పుడు నిలదీసే బలమైన ప్రతిపక్షం వుండడం కూడా దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు అంతే అవసరం.

ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను చూసి పరిపాలన నియంతృత్వం వైపు దారితీస్తుందేమోనని చాలామంది భయపడ్డారు. గత 5ఏళ్ల ఎన్డీఏ పాలనలో నోట్ల రద్దు, జిఎస్టీ వంటి నిర్ణయాలు చూసినవాళ్లకు ఈ ఏడాది ఎన్నికల్లో కూడా మళ్లీ ఎన్డీఏ అధికారంలోకి రావడం, వచ్చీ రాగానే ప్రధాని నరేంద్ర మోడీ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడంతో దేశం నియంతృత్వం వైపుగా సాగుతుందేమోనన్న అనుమానాలు వచ్చాయి. దేశ రక్షణ, ఉగ్రవాదం విషయంలో నియంతృత్వ ధోరణులను ప్రజలు అంగీకరిస్తారుగాని, దాదాపు 7దశాబ్దాలుగా ఉచిత సంక్షేమ పథకాలను చవిచూసిన ప్రజలు ఆర్థిక నియంతృత్వాన్ని మాత్రం సహించలేరు. ఈ నిరసననే నిన్నటి మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల ఫలితాల ద్వారా తేల్చిచెప్పారు.

ఈ రెండు రాష్ట్రాల్లో పెద్దపార్టీగా అవతరించినప్పటికీ బీజేపీకి ఈ ఫలితాలు సంతృప్తినివ్వలేదు. సరికదా, కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా అంతం కాలేదు, మీరు కలలుకంటున్న 'కాంగ్రెస్ ముక్త్ భారత్' కల నెరవేరలేదు, మీరు జాగ్రత్తగా వ్యవహరించకపోతే వ్యతిరేకత ఖాయం అనే సంకేతాలు బీజేపీ నాయకత్వానికి అందజేశాయి. అదే సమయంలో దేశ రాజకీయాలలో మా పని అయిపోయింది అని కాడ దించేసిన కాంగ్రెస్ అధిష్టానానికి ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు ఆక్సిజన్ అందించాయనే చెప్పవచ్చు. భవిష్యత్‌పై ఆశలు కల్పించాయనుకోవచ్చు.

ఒకప్పుడు కాంగ్రెస్‌ను ఎదుర్కోవడానికి దేశంలోని అన్ని పార్టీలు ఏకమయ్యేవి. ఇప్పుడు బీజేపీని ఎదుర్కోవడానికి కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలు ఏకం కావాల్సి వస్తోంది. ఈ పరిస్థితులు చేజేతులా కాంగ్రెస్ కల్పించుకున్నవే! కాలంతో పాటు ఆలోచనలు మారాలి. ధోరణి మారాలి. విధానాలు, సిద్ధాంతాలు మారాలి. ఈ విషయంలో భారతీయ జనతాపార్టీ వేగాన్ని కాంగ్రెస్ అందుకోలేకపోయింది. 1980 దశకంలో బీజేపీని ప్రారంభించినప్పుడు అది ఉత్తరాది పార్టీ. అయోధ్యలో రామమందిరం ఉద్యమాన్ని మొదలుపెట్టాక అది మతోన్మాదపార్టీ. అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చాక మైనార్టీ వ్యతిరేక పార్టీ అయ్యింది. అయినా కూడా ఆ పార్టీ ఆ ముద్రలను తొలగించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. తమ పరిపాలనా కాలంలో ఒక ముస్లింను, ఒక దళితుడిని రాష్ట్రపతులుగా చేసింది. క్రైస్తవ మతం ఎక్కువగా వుండే ఈశాన్య రాష్ట్రాల్లో సైతం అధికారాన్ని చేజిక్కించుకుంది. ఉత్తరాదిపార్టీగా ముద్రపడ్డా కూడా కర్నాటక వంటి దక్షిణాది రాష్ట్రంలో పాగా వేయగలిగింది. మైనార్టీ వర్గాల ప్రజలు ఏ కారణాలతో అయితే తమకు దూరంగా వుంటున్నారో ఆ కారణాలను సంస్కరించుకుంటూ, విధానాలను మార్చుకుంటూ బీజేపీ అన్ని వర్గాల ప్రజలకు దగ్గర కాసాగింది. అదే సమయంలో పాత విధానాలను వీడక, బూజుపట్టిన సిద్ధాంతాలను భుజాలకెత్తుకుని కాంగ్రెస్ రాజకీయంగా కష్టాలను, నష్టాలను పెంచుకోసాగింది. ఓట్ల మీద మమకారంతో ఓట్లబ్యాంకు రాజకీయాలతో ఆ పార్టీ చివరకు ఓటర్లకే దూరమవుతూ వచ్చింది. అధికారంలో వున్నప్పుడు జరిగిన అవినీతి కుంభకోణాలు, మితిమీరిన మైనార్టీ వాదం కాంగ్రెస్‌ను ఈ దేశ మెజార్టీ ప్రజల మనసుల నుండి దూరం చేసింది. ఉగ్రచర్యలను సైతం మతం కోణంలో చూసిన కాంగ్రెస్ నీచరాజకీయాలను ఈ దేశ ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా కాంగ్రెస్‌పార్టీ అన్నది హిందువులకు బద్ధశత్రువు, హిందువుల నాశనం కోరుకునే పార్టీ, హిందూ సాంప్రదాయాలను గౌరవించని పార్టీ అంటూ బీజేపీ చేసిన ప్రచారం విజయవంతం కావడంలో కాంగ్రెస్ పాత్ర లేకుండా పోలేదు. వీలు చిక్కినప్పుడల్లా కాంగ్రెస్ నాయకులు హిందూ సంస్కృతిపై విషం కక్కుతూ వచ్చారు. మతపరమైన విభజనలు చేస్తూ, విషబీజాలు నాటుతూ వచ్చారు. నెహ్రూ, ఇందిరల హయాంలో ఆరెస్సెస్‌ను వ్యతిరేకించారేగాని, హిందూవ్యతిరేక భావనలను నెత్తికెత్తుకోలేదు. సోనియాగాంధీ హయాం వచ్చేసరికి 'హిందూ ఉగ్రవాదం' అనే కొత్త పేరును కాంగ్రెస్ నాయకులు కనిపెట్టి దానికి ప్రచారం కల్పించారు. దీంతో కాంగ్రెస్ అంటే పక్కా హిందూ వ్యతిరేక పార్టీ అనే ముద్రపడి పోయింది. మెజార్టీ హిందువులు ఆ పార్టీని దూరంగా పెడుతూ వచ్చారు. మన్మోహన్‌సింగ్ వంటి మేధావి కూడా తాను ప్రధానిగా వున్న సమయంలో ఈ దేశంలోని వనరులపై మైనార్టీలకే ప్రథమ హక్కు అని ప్రకటించి మెజార్టీ హిందువుల్లో కాంగ్రెస్‌పై మరింత వ్యతిరేకత పెంచాడు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్.... వీళ్లెవరికీ బీజేపీతో సంబంధాలు లేవు. వాళ్ళున్నప్పుడు బీజేపీ అనే పార్టీ కూడా లేదు. కాని, కాంగ్రెస్‌లో వున్న గాంధీ, నెహ్రూ కుటుంబ బానిసత్వ వ్యాధి వల్ల ఈ మహానాయకులను బీజేపీ తన సొంతం చేసుకుని ప్రచారానికి వాడుకుంటోంది. ఆఖరకు రాజీవ్‌గాంధీ హత్య తర్వాత ఒక దశలో కాంగ్రెస్‌ను, దేశాన్ని నిలబెట్టిన పి.వి.నరసింహారావును కూడా కాంగ్రెస్ వదులుకుంటే, బీజేపీవాళ్ళు ఆయనను తమ ఖాతాలోకి లాగేసుకున్నారు. ఇలా కాంగ్రెస్ తప్పులే బీజేపీకి వరమవుతున్నాయి. కాంగ్రెస్ వదులుకుంటున్నవే ఆ పార్టీకి ఓట్లవుతున్నాయి. ఎన్నికల సమయంలో నుదుటన తిలకం పెట్టి గుళ్లు, గోపురాలు తిరిగినా కాంగ్రెస్ నాయకులు ఈ దేశ మెజార్టీ ప్రజల మనసులు గెలువలేరు. ముందు హిందుత్వ భావనపై తమ వైఖరి మార్చుకోవాలి.. వ్యతిరేక ధోరణి వీడాలి. కాంగ్రెస్ ముందుగా తనను తాను సంస్కరించుకుని మెజార్టీ ప్రజల మనసులకు మళ్లీ దగ్గరకాగలిగితే పతనం అంచుల నుండి మళ్లీ వెనక్కి మళ్లీ రాజకీయంగా పరుగు అందుకోగలదు.

---

### వేడుకగా..
## ధన్వంతరి మహర్షి జయంతి

నెల్లూరు బాలాజీనగర్‌లోని ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్, బ్రాహ్మణ జాగృతి నెల్లూరుశాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 26న ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఇందిరాదేవి ఈ కార్యక్రమంలో పాల్గొని ధన్వంతరి మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. నగరంలోని జయభారత్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రసాద్‌రావు, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రామ్మూర్తి, డాక్టర్ నరసింహారావు, ఉషాకుమారి, నిర్వాహకుడు రామచంద్రరావు, లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రంగనాథుని సన్నిధిలో..
## నరకచతుర్ధశి వేడుకలు


నరకాసుర బొమ్మ దహనం

నెల్లూరులోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామివారి దేవస్థానం వద్ద గత నెల 26న నరకచతుర్ధశి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకారం చేసి విశిష్ట పూజలు నిర్వహించారు. రాజగోపురం వరకు స్వామివారిని ఊరేగింపుగా తీసుకువచ్చి అక్కడ ఏర్పాటుచేసిన నరకాసురుని బొమ్మను దహనం చేసి టపాసులు కాల్చి ఆనందంగా వేడుక జరుపుకున్నారు. ఆలయ ఇ.ఓ వేమూరి గోపి, ప్రధాన అర్చకుడు కిడాంబి జగన్నాధాచార్యులు, సుదర్శనాచార్యులు తదితరుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

---




## పరిశీలన చేసుకోవాలి

మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బీజేపీ అధిష్టానం ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఆ రెండు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు అత్యంత బలహీనంగా వున్నప్పటికీ బీజేపీ రెండు చోట్లా గట్టిపోటీతో అధికారంలోకి వచ్చింది. దేశ భద్రత, జాతీయవాదం, ఆర్టికల్ 370 వంటి అంశాలు కేంద్రంలోని ప్రభుత్వాన్ని ఎన్నుకునే లోక్‌సభ ఎన్నికల్లో పని చేశాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాలలోని సమస్యలే ప్రధానంగా ప్రభావితం చేస్తుంటాయి. బీజేపీ అగ్రనాయకులు పిడుక్కి, దెయ్యానికి ఒకే మంత్రమన్నట్లు అసెంబ్లీ ఎన్నికలలోనూ జాతీయ అంశాలను ప్రచారం చేయడం వారికి ప్రతికూలాంశంగా మారింది.

**ధనిరెడ్డి మాధవ, హైదరాబాద్.**

## కామన్ సివిల్ కోడ్ అమలు చేయాలి

"ఒకే దేశం... ఒకే చట్టం" ఇది భారతీయ జనతాపార్టీ నినాదం. కాని, అధికారంలో వున్న గత ఐదేళ్లలో బీజేపీ ఈ చట్టాన్ని అమలు చేయలేదు. కనీసం రాబోయే నాలుగు న్నరేళ్లలోనన్నా ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రపంచంలోనే ఏ దేశంలో లేని విధంగా ఈ దేశంలోనే మతానికొక చట్టం వుంది. దేశ ప్రయోజనాల కంటే ఏ మత విశ్వాసాలు గొప్పవి కావు. మతాలు ఏవైనా మనుషుల అవసరాలు, ప్రయోజనాలు ఒకటే! దేశమంతా ఒకే చట్టం పెట్టాలి. ప్రతిఒక్కరూ చట్టాన్ని గౌరవించాలి. దేశ జనాభాను నియంత్రించుకోవాలి. లేదంటే భవిష్యత్‌లో తిండి గింజలు కూడా కరువవుతాయి. దేశంలో మతపరంగా చట్టాలు అమలు చేస్తుండడం వల్ల ఎన్నో శాంతి భద్రతల సమస్యలు, సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజల మధ్య అసమానతలు కూడా సృష్టించబడి చట్టాలపై గౌరవం లేకుండా పోతోంది!

**సి.రాజీవి, నెల్లూరు.**

## ఆక్రమణలపై దృష్టి పెట్టండి

కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి చిన్న విన్నపం. స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి రెవెన్యూ, ఆర్ అండ్ బి మంత్రిగా వున్న సమయంలో మండల కేంద్రమైన విడవలూరులో ఎన్‌టిఆర్ మెయిన్‌రోడ్డు కూడలిని ఆర్ అండ్ బిలో కలిపారు. అప్పట్లో రోడ్లు వెడల్పుగా వుండేది. కాని ఇప్పుడు ఒక హాస్పిటల్ కబ్జా వల్ల ఇక్కడ వాహనాలు మలుపు తిరగడం కష్టంగా వుంది. ఫుట్‌పాత్ మార్జిన్ కూడా లేదు. దీనిపై మీరు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

**- బి.వెంకటేశ్వర్లు, విడవలూరు.**

## డిజిపిని బెదిరించడం సరికాదు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిజిపి గౌతమ్ సవాంగ్‌ను బెదిరించడం సరికాదు. సమర్ధ అధికారిపై నిందలు వేయడం సముచితం కాదు. నాలుగు నెలల క్రితం ఎన్నికలకు ముందు గౌతమ్ సవాంగ్ నిజాయితీ అధికారి అని, అందుకే ఆయనను విజయవాడ పోలీసు కమిషనర్‌గా నియమించామని పదేపదే చెప్పిన చంద్రబాబు, సవాంగ్ డిజిపి కాగానే ఆయనపై విమర్శలు చేయడం నిజాయితీ అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీసే విధంగా మాట్లాడడం తగదు. 15ఏళ్లు ముఖ్యమంత్రిగా, 10సంవత్సరాలు ప్రతిపక్ష నాయకునిగా పనిచేసిన అనుభవం వున్న నాయకుడు డిజిపిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు హర్షించరు.

**డా॥ యస్.బాబూరావు, కావలి.**

## అమరవీరుల స్మరణోత్సవం రోజున కూడా వసూళ్ళు

'అవినీతిని తన్ని తరిమేద్దాం' అన్న ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ప్రకటనను 'లాయర్'లోనే చదివాను. 21వ తేదీన పోలీసు అమరవీరుల దినోత్సవం రోజున కూడా గూడూరు మార్కెట్ సెంటర్‌లో పనిచేసే హోంగార్డులు ఎస్పీ ఆదేశాలను ధిక్కరించి ఆటోకు 20రూపాయలు లెక్కన వసూలుచేశారు. మాకు జగనన్న ఇచ్చే 10వేలు ఈ హోంగార్డుల రోజువారీ వసూళ్లకు సరిపోద్ది. ఎస్పీ గారు ఈ వసూళ్లపై దృష్టి పెట్టాలి.

**ఓ ఆటోడ్రైవర్, చేడిమాల.**

# నరకానికి నకళ్ళు.. నెల్లూరు రోడ్లు



కార్పొరేషన్ పరిధిలో చూస్తే ముత్తుకూరురోడ్డులో హరనాథపురం, ధనలక్ష్మీపురం ప్రాంతాల్లో రోడ్డు గుంతలమయమై ఉన్నాయి. ఈ రోడ్ల మీద నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. కృష్ణపట్నం పోర్టుతో పాటు పేరుమోసిన ఆసుపత్రులు, విద్యాసంస్థలు ఈ రోడ్లోనే వున్నాయి. గుంతలమయంగా మారిన రోడ్డు వాహనదారులను తిప్పలు పెడుతోంది. స్టోన్‌హౌస్‌పేట, కొత్తకోడూరు రోడ్డు, డంపింగ్‌యార్డ్ – అల్లీపురంల మధ్య రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్లలో వెళ్లే వాహనదారులకు ఇక్కడ ఏర్పడ్డ గోతులతో చుక్కలు కనిపిస్తున్నాయి. పాత చెక్‌పోస్ట్ నుండి కిసాన్‌నగర్ దాకా మైపాడురోడ్డు కూడా ఇలాగే మారింది. మూలాపేట – జొన్నవాడ రోడ్డు కూడా ఇరుకళలమ్మ పరమేశ్వరి గుడి ప్రాంతంలో బాగా దెబ్బతిని వుంది. బివి.నగర్ ప్రాంతంలో మినీ బైపాస్‌రోడ్డు గోతులమయంగా వుంది. బాలాజీనగర్, ఉస్మాన్‌సాహెబ్‌పేట, చిన్నబజార్, ఆచారివీధి ప్రాంతాల్లో గతంలో వున్న రోడ్లను తవ్వి పైపులు వేశారుగాని మళ్ళీ ఆ రోడ్లను సరిచేయలేదు. ముఖ్యంగా చిన్నబజారు ప్రాంతంలోని సందులైతే 5అడుగులకు మించి వెడల్పు వుండవు. ఈ వీధులనే తవ్వారు. ఆ సందుల్లో వాహనాలలో కాదు నడక కూడా నరకంగా వుంటోంది. మొన్నటి ఎన్నికల్లో చాలా మంది తెలుగుదేశం అభ్యర్థులకు ఓట్లేయక పోవడానికి కారణం ఈ దెబ్బతిన్న రోడ్లే!

*భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల పనులతో నెల్లూరు నగరంలోని రోడ్లు ఎంతగా ధ్వంసం అయ్యాయో తెలిసిన విషయమే! గత తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టిన ఈ పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. కొన్ని ప్రాంతాల్లో ఎండ్ టు ఎండ్ పేరుతో వీధంతా సిమెంట్ రోడ్లు పరిచారు. మొక్కలు నాటడానికి, చెట్లు పెంచడానికి మార్జిన్ కూడా లేకుండా చేశారు. ఇంకొన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ కోసం తవ్విన రోడ్లను మళ్ళీ వేయకుండా అలాగే వదిలేశారు. ఇలా అరకొరగా వదిలేసిన రోడ్లే వాహనదారులకు, ప్రజలకు నరకం చూపిస్తున్నాయి.*

అలాగే, నెల్లూరు రూరల్ పరిధిలో చూస్తే కొండాయపాలెంరోడ్డు, బి.వి.నగర్ మెయిన్‌రోడ్డు, ఏ.కె.నగర్ పోస్టాఫీసు రోడ్డు, పొదలకూరురోడ్డు, వైయస్సార్‌నగర్ మెయిన్‌రోడ్డు, బుజబుజనెల్లూరు రోడ్డు, చంద్రబాబునగర్... ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో ప్రాంతాల్లో రోడ్లు పరమ అధ్వాన్నంగా ఉన్నాయి.

గత ప్రభుత్వంలో ఈ రోడ్లపై విమర్శలు చేసినవాళ్ళే ఇప్పుడు అధికారంలో ఉన్నారు. ఈ రోడ్ల గురించి, ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి బాగా తెలిసింది కూడా వారికే!

మంత్రిగా వున్న నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ అయినా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ రోడ్లను త్వరితగతిన బాగు చేయించాలని, ప్రజలు పడుతున్న ఇబ్బందులను తప్పించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# పారిశ్రామిక కోటగా.. పేట

## నాయుడుపేటకు సీపెట్ కేంద్రం



**నియోజకవర్గానికి కేంద్రం కాకపోయినప్పటికీ జిల్లాలో నాయుడుపేట పట్టణానికి ప్రత్యేక గుర్తింపు వుంది. నెల్లూరు, చెన్నై, తిరుపతి... మూడు ముఖ్య నగరాల కూడలి నాయుడుపేట. వీటిలో ఏ నగరం నుండైనా దాదాపు ఒకే దూరంలో, మూడు నగరాలకు దగ్గరగా వున్న పట్టణం. నెల్లూరు నుండి చెన్నై, తిరుపతిల వైపు వెళ్లేవారికైనా, లేదా అటువైపు నుండి నెల్లూరుకు వచ్చేవారికైనా ఈ పట్టణం ఒక మజిలీ అనుకోవచ్చు.**

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో నాయుడుపేటకు పారిశ్రామికంగా గుర్తింపు వచ్చింది. నాయుడుపేట సమీపంలోనే మేనకూరు సెజ్‌ను ఏర్పాటు చేయడం, ఎన్నో బహుళజాతి కంపెనీలు ఇక్కడ తమ పరిశ్రమలు స్థాపించడం, వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కలగడం జరిగింది.

వై.యస్. మరణం తర్వాత గత 9ఏళ్లలో నాయుడుపేట అభివృద్ధి గురించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంగాని, నిన్నటివరకు వున్న తెలుగుదేశం ప్రభుత్వం గాని పట్టించుకోలేదు. కాని, వైసిపి అధికారంలోకి వచ్చిన ఐదునెలల్లోపే నాయుడుపేటకు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ప్లాస్టిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్ మంజూరైంది. దేశవ్యాప్తంగా 35సీపెట్(సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీ) కేంద్రాలుండగా, మన రాష్ట్రంలో గన్నవరంలో పూర్తయిన సీపెట్ కేంద్రాన్ని ఇటీవలే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి సదానందగౌడలు ప్రారంభించారు. ఈ సందర్భంగానే నాయుడుపేటలో మరో సీపెట్ కేంద్రాన్ని నెలకొల్పుతున్నట్లు వారు ప్రకటించారు.

ఈ సెంటర్ ద్వారా ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఎంతోమంది ప్రతిభావంతులను తయారుచేయవచ్చు. ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా కూడా ప్లాస్టిక్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు దండిగా వున్నాయి. కాని దానికి సంబంధించిన సాంకేతిక నిపుణులే కొరతగా వున్నారు. ఈ సెంటర్ ఏర్పాటుతో ఆ కొరత కూడా తీరి ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవడానికి మార్గం ఏర్పడుతుంది.

## అభిమానుల, అనాధల ఆనందోత్సవంగా...

# ఆదాల జన్మదినోత్సవం



వాత్సల్య అనాథాశ్రమ గౌరవాధ్యక్షులు సామంతు గోపాలరెడ్డికి లక్ష 50వేల రూపాయల విరాళం అందజేస్తున్న ఆదాల దంపతులు



వృద్ధాశ్రమంలో నిరాధార వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు పార్లమెంటు సభ్యుడి హోదాలో అక్టోబర్ 25వ తేదీన ఆదాల ప్రభాకర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని ఆయన అభిమానులు, అనుచరులు ఒక పండుగగా చేశారు. ఆదాలకు జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలతో మినీబైపాస్‌ను నింపేశారు. ఆరోజు ఉదయాన్నే మినీబైపాస్‌లోని ఆదాల నివాసం వద్ద భారీఎత్తున టపాసులు కాల్చి స్వీట్లు పంచారు. ఏపిఆర్ జిందాబాద్ అనే నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఆరోజు ఉదయాన్నే ఆదాల, ఆయన సతీమణి వింధ్యావళిలు వేదపండితుల ఆశీస్సులందుకున్నారు. అనంతరం లోక్‌సభ పరిధిలోని పలుప్రాంతాల నుండి భారీగా వచ్చిన ప్రజలు, అభిమానులు ఆదాలకు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఆదాల జన్మదినం సందర్భంగా ఆయన ఇంటిపై అభిమాని నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఎగురవేసిన భారీ బెలూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### జన్మదినోత్సవాన... సేవా మహోత్సవం

ఆదాల తన జన్మదినోత్సవాన్ని ఒక సేవా మహోత్సవంగా మలిచారు. తన పుట్టినరోజునాడు కొండాయపాలెం రోడ్డులోని జనహిత – వాత్సల్య అనాథాశ్రమంకు సతీసమేతంగా విచ్చేసిన ఆదాల ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఆ ఆశ్రమంకు లక్షా50వేల రూపాయలు విరాళంగా అందించారు. ఈ ఆశ్రమాన్ని చిత్తశుద్ధితో నడుపుతున్న సామంతు గోపాల్‌రెడ్డి, జి.వి.సాంబ శివరావులను ఆయన అభినందించారు. అలాగే విశ్వభారతి అంధుల పాఠశాలను సందర్శించిన ఆయన దివ్యాంగులతో కొంత సమయం గడిపి ఆ పాఠశాలకు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు.

ఆదాల జన్మదినోత్సవ వేడుకను ఆయన అనుచరులు, అభిమానులు పలు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, ఆసుపత్రులలో కూడా నిర్వహించి అన్నదానం, పండ్లు, స్వీట్లు పంచడం వంటివి చేశారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పర్యవేక్షణలో ఆదాల జన్మదిన వేడుకలు ఒక సేవా పండుగగా జరగడం విశేషం.

# సాగునీళ్ళు విడుదల చేసిన ఆనం



అక్టోబర్ 29వ తేదీన దక్కిలి మండలంలోని వెలికల్లు మెయిన్ రోడ్డు సమీపాన తెలుగుగంగ 3వ బ్రాంచ్ కెనాల్‌కు, మోపూరు వడ్డిపల్లి సమీపాన 4వ బ్రాంచ్ కెనాల్‌కు, ఊట్లపల్లి సమీపంలోని 5వ బ్రాంచ్ కెనాల్‌కు వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి సాగునీటిని విడుదల చేశాడు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలోని ప్రతి ఎకరాకు తెలుగుగంగ నీటిని అందజేస్తామని చెప్పాడు. శ్రీశైలం నుండి సోమశిలకు సమృద్ధిగా నీటి విడుదల జరుగుతుందని, సోమశిల నుండి దిగువకు 10,500క్యూసెక్కులు నీళ్ళు విడుదలవుతున్నాయని, నీళ్ళ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నాడు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్స్ పూర్తయ్యాయని, ఈరోజు అన్ని చెరువులకు వాటి ద్వారానే నీళ్ళు చేరుతున్నాయని అన్నాడు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంటు సభ్యులు బల్లి దుర్గాప్రసాదరావు, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, వి.వరప్రసాద్, మాజీశాసనసభ్యులు సాయికృష్ణ యాచేంద్ర, వైసిపి నాయకులు కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి, నెమలిపూడి సురేష్‌రెడ్డి, గిరిరెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, మురళీనాయుడు, బొల్లినేని ధనుంజయనాయుడు, ఢిల్లీబాబు, ఇరిగేషన్ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## నెల్లూరు కబుర్లు

# నగరంలో ఆహ్లాదం

నెల్లూరు నగర ప్రజలు పూర్తిస్థాయిలో వానా కాలాన్ని చూసి చాలా ఏళ్లయ్యింది. గత నాలుగేళ్లుగా అయితే నవంబర్, డిసెంబర్ నెలల్లో కూడా ఎండలు అదరకాశాయి. సంవత్సరం పొడవునా వానాకాలం, చలికాలం అన్నవే లేకుండా ఎండాకాలంతో సరిపో యేది. క్రితం ఏడాది వరకు డిసెంబర్, జనవరి నెలల్లో కూడా ఏసిలు ఆన్‌చేసి పడుకున్న పరిస్థితి. ఈ ఏడాది మాత్రం అక్టోబర్, నవంబర్ నెలల్లో సహజసిద్ధమైన వానాకాలాన్ని చూస్తున్నారు. తరచూ కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఆహ్లాదంగా వుంటుంది. నగరపౌరులు కూడా వానలను ఎంజాయ్ చేస్తున్నారు.

● టార్గెట్ జూన్

# నెల్లూరు బ్యారేజీకి గడువు పెట్టిన అనిల్



నెల్లూరులోని పెన్నా బ్యారేజీకి మహానుభావుడు వై.యస్.రాజశేఖరరెడ్డి ఏ ముహూర్తంలో శంకుస్థాపన రాయి వేశాడోగాని అది పోలవరం ప్రాజెక్ట్ కన్నా పెద్దప్రాజెక్ట్ అన్నట్లుగా సాగుతోంది. వై.యస్. శంకుస్థాపన చేసిన ఏ ఒక్క పనీ ఆగలేదు. ఒక్క నెల్లూరు బ్యారేజీ మాత్రం మొండికేస్తోంది. బహుశా ఆయన రెండో టర్మ్‌లో కూడా వుండుంటే అప్పుడే ఈ బ్యారేజీ పూర్తయ్యుం డేదేమో! ఆయన మరణం ఈ బ్యారేజీకి శాపంగా మారింది. ఆయన తర్వాత ముగ్గురు ముఖ్యమంత్రులు వచ్చినా ఈ బ్యారేజీ నిర్మాణం పూర్తి కాలేదు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అయితే, జిల్లా మంత్రిగా వున్న పి.నారాయణ ఈ బ్యారేజీ పూర్తికి అయిదారు ముహూర్తాలు పెట్టాడు. కాని పూర్తి చేయలేకపోయాడు.

ప్రస్తుతం వైసిపి ప్రభుత్వముంది. ఇరిగేషన్ మంత్రిగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ వున్నాడు. బ్యారేజీని పూర్తి చేయడం ఆయన శాఖలోని పనే! జూన్‌కల్లా పూర్తి చేస్తానంటున్నాడు. ఆ ముహూర్తానికైనా బ్యారేజీ పూర్తయ్యి వాడుకలోకి రావాలని ఆశిద్దాం!

## మురికి కాలువల్లో

# పూడిక తీయాలి



నెల్లూరు నగరంలో ముదురుదోమల వ్యాప్తికి ప్రధానకారణం మురికి గుంటల్లో నిల్వవున్న మురికి. వ్యర్థాలతో నగరంలోని మురుగు కాలువలన్నీ పూడి పోయి వున్నాయి. దోమల ఉత్పత్తికి ఇవే ప్రధాన కేంద్రాలవుతున్నాయి. గత నాలుగేళ్లుగా జిల్లాలో వర్షాలు లేవు. వర్షాలు పడితే ఈ కాలువల్లో మురికి కొట్టుకుపోయేది. దోమల లార్వాలు వాటిలో పోయేవి. కాని, వర్షాలు లేని కారణంగా కాలువల్లో మురికి ఎక్కడికక్కడ పేరుకుపోయి వుంది. ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు గుడ్లు పిగిలి దోమలు మళ్లీ విజృం భిస్తున్నాయి. కాలువల్లో మురికిని తొలగిస్తే వర్షాల సమయంలో నీళ్ళు పారడం, రోడ్లపైకి మురికి నీళ్లు రాకుండా వుండడం జరుగుతుంది. ఈ పూడికల వల్ల వర్షాకాలంలో మురికి నీళ్ళు ఇళ్ళ ముందు నిలిచి దోమలకు, పందులకు నిలయాలై రోగాలకు కారణ మవుతున్నాయి. ఇకనైనా మురికి కాలువల్లో పూడికలు తీయడంపై కార్పొరేషన్ పారిశుద్ధ్య అధికారులు దృష్టిపెట్టాలి.

## అక్రమార్కులపై

# చర్యలు తీసుకోండి


### - స్పందనలో కలెక్టర్‌ను కోరిన ఏవిఆర్



జిల్లాలో యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి సోమవారం స్పందన కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుకు వినతి పత్రం సమర్పించాడు. గత 4నెలలుగా పొట్టేపాలెం రీచ్ నుండి ఇసుక అక్రమంగా తరలించారు. దానికి బాధ్యులెవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఇసుక మాఫియా ముసుగు తొలగించి, ఎవరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారో వెల్లడించాలని ఆయన ఆ వినతి పత్రంలో కోరాడు. గడచిన మూడునెలల్లో పలుసార్లు ఇసుక పాలసీలు మార్చినా, ఇసుక లభ్యంకాక ప్రజలు, పనులు లేక భవననిర్మాణ కార్మికులు అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నాడు.

## నెల్లూరులో

# గుండూబాస్ దీపావళి



ఆనం నివాసంలో రంగమయూర్‌తో ముచ్చటిస్తున్న కిరణ్‌కుమార్

"డబ్బులు వూరికే రావు" ఈ నినాదం ఇప్పుడు బాగా పాపులర్ కావడమే కాదు, ఎన్నో అంశాలకు కూడా అన్వయించుకుంటున్నారు. ఆ నినాదం సృష్టికర్త, అందరి కళ్లల్లో, మనసుల్లో గుండుబాస్‌గా ముద్ర వేయించుకున్న లలిత జ్యూయలర్స్ అధినేత కిరణ్‌కుమార్ దీపావళి పండక్కి తన స్వస్థలం నెల్లూరుకు వచ్చాడు. మండపాలవీధిలోని తన ఇంట్లో దీపావళి వేడుకలు జరుపుకున్నాడు. బంధువులు, స్నేహితులను కలుసుకున్నాడు. ఏ.సి సెంటర్‌లో స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి ఇంటికెళ్లాడు. వివేకా కుమారుడు ఆనం రంగమయూర్‌రెడ్డితో కొద్దిసేపు ముచ్చటించి వివేకానందరెడ్డితో తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాడు.

## పముజులకు

# సోమిరెడ్డి పరామర్శ



అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఐ సీనియర్ నాయకులు పముజుల దశరథరామయ్యను మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల సౌత్‌మోపూరులోని ఆయన ఇంటికెళ్లి పరామర్శించాడు. దశయ్య యోగ క్షేమాలు అడిగి, ఆయనను త్వరగా కోలుకుని, మళ్ళీ ఆరోగ్యంగా తిరగాలని ఆకాంక్షించాడు.

# నవంబర్‌లోనే పక్షుల పండుగ



సూళ్లూరుపేట కేంద్రంగా ప్రతినెల జనవరి నెలలో నిర్వహించే పక్షుల పండుగను ఈసారి నవం బర్‌లోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ నెలలో పండుగ తేదీలను మంత్రులు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే, కలెక్టర్‌లు కూర్చుని చర్చించి నిర్ణయించాల్సి వుంది.

## సుబ్బరాజుకు

# ముదిరాజ్‌ల సత్కారం



2018-19 సంవత్సరానికిగాను రియల్‌ఎస్టేట్ రంగంలో సాధించిన విజయాలకు 'ఇండియా గ్రేటెస్ట్ బ్రాండ్ అండ్ లీడర్' అవార్డ్‌ను అందుకున్న గ్రీన్‌సిటీ ఎస్టేట్స్ అధినేత కొండ్రాజు సుబ్బరాజును ఇటీవల నెల్లూరు పొగతోటలోని వైయస్ఆర్ కాంప్లెక్స్‌లో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు కనకట్ల రఘురాం ముదిరాజ్ ఘనంగా సత్కరించాడు. ఈ కార్యక్రమంలో ఇంకా పలువురు ముదిరాజ్ మహాసభ సభ్యులు పాల్గొన్నారు.

# విశ్వసాయి ర్యాంకర్లకు ప్రతిభా పురస్కారాలు



నెల్లూరులోని విశ్వసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక మాగుంట లేఅవుట్‌లో ఉన్న హెచ్‌ఎన్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గత నెల 26న విశ్వసాయి ర్యాంకర్లకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా విశ్వసాయి విద్యాసంస్థలు నిలిచాయని ప్రశంసించారు. 2012 నుంచి 2019 దాకా ఇక్కడి విద్యార్థులు 600 మంది మెడికల్ సీట్లు సాధించడం గొప్ప విషయమన్నారు. ఎంతో కష్టపడితే తప్ప ఇలాంటి విజయం సాధ్యం కాదని, నాణ్యత గల విద్యాబోధన, విద్యార్థులు ఇష్టపడి చదువుకునే వాతావరణాన్ని కల్పించడం ఈ విజయాలకు కారణమన్నారు. కళాశాల వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు వత్తిడి లేని విద్యతో పాటు తాము అవలంభించే పటిష్టమైన విద్యాబోధన ప్రణాళికలతోనే మంచి ఫలితాలు సాధించగలుగుతున్నామన్నారు. కళాశాల ఛైర్మెన్ డా. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు స్ఫూర్తిని అందించేందుకే ఇలా ప్రతిఏటా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మెడికల్, ఇంజనీరింగ్‌లలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విశ్వసాయి ఛైర్‌పర్సన్ శ్రీమతి ఎస్.రుక్మిణి, ప్రిన్సిపాల్స్‌తో పాటు అధ్యాపకులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గుండెపోటుకు ప్రాథమిక చికిత్స అవసరం



వాకర్స్‌కు మాత్రలను పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు అధ్యక్షతన గతనెల 29న నెల్లూరు ఏసీ స్టేడియంలో శుభమస్తు షాపింగ్ మాల్ యజమానులు బయ్యా వాసు, బయ్యా రవికుమార్ సహకారంతో గుండెపోటుకు సంబంధించిన మాత్రలు పంపిణీ చేశారు. లోడింగ్ డోసుగా 6 మాత్రలు దాదాపు 500 మంది వాకర్స్ సభ్యులకు కిట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకున్నందువల్ల గుండెపోటు వచ్చిన గంటలోపు జరగవలసిన ప్రాథమిక చికిత్స జరిగి ప్రాణాపాయస్థితి నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చున్నారు. ఒకవేళ గుండెపోటు కానప్పటికి ఈ మాత్రలు వాడినందువల్ల ఎటువంటి ప్రమాదం లేదన్నారు. ఈ మందుల కిట్ లో ఆస్ప్రిన్-325 యంజీ ఒక మాత్ర, అటార్ వాట్సాపిన్-80 యంజి ఒక మాత్ర, క్లోపిడోగ్రిల్-75 యంజి నాలుగు మాత్రలు ఒకేసారి వేసుకోవాలన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సీయస్ శ్రీనివాసరాజు మార్గదర్శకత్వంలో ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. యంవి సుబ్బారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, యస్.రాఘవేంద్రశెట్టి, వినుకొండ వెంకటేశ్వర్లు, కొండూరు సుబ్బారావు, వి.హజరత్‌బాబు, జీవీ కృష్ణయ్య, బయ్యా శ్రీనివాసులు(వాసు) పాల్గొన్నారు.

## దీపావళినాడు నెల్లూరులో..

# భారీ అగ్నిప్రమాదం



**దీపావళి పండుగ అందరి ఇళ్లల్లో ఆనందం నింపితే, ఒకరిముందు మాత్రం కష్టాలు, నష్టాలు వుంచింది. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తీసింది. అక్టోబర్ 27వ తేదీ రాత్రి దీపావళి రోజున నెల్లూరు నగరం, పెద్దబజారులో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పాత వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమీపం లోని కనకదుర్గ మెటల్‌స్టోర్‌పై బాణాసంచా రవ్వలు పడి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. కోట్లలోనే నష్టం వుండొచ్చని అంచనా!**

ఈ దుకాణంలో వలలు, ప్లాస్టిక్ పట్టలు, ప్లాస్టిక్ తాళ్ళు, థర్మాకోల్ షీట్స్ వంటి మెటీరియల్ వుంటుంది. ఎక్కువ భాగం ప్లాస్టిక్‌కు సంబంధం వుండే వస్తువులే! భారీ ఎత్తున స్టాక్ కూడా వుంటుంది. క్రింది అంతస్తులో దుకాణం వుండగా, మొదటి అంతస్తులో దుకాణం యజమాని అశోక్‌సింగ్ కుటుంబం కాపురం ఉంటుంది. రెండవ అంతస్తులో ఎటువంటి శ్లాబు లేకుండానే గోడౌన్ నిర్వహిస్తూ అక్కడే పెద్దఎత్తున స్టాక్ పెట్టివున్నారు. ఆదివారం రాత్రి పెద్దబజారులో అందరూ భారీఎత్తున బాణా సంచా కాలుస్తున్నారు. ఈ బాణాసంచా రవ్వలు రెండో అంతస్థులో పడి మంటలు చెలరేగాయి. అక్కడ వున్నదంతా ప్లాస్టిక్ మెటల్ వస్తువులు కావడంతో శరవేగంగా మంటలు వ్యాపించి అన్ని అంతస్థుల్లోనూ వస్తువులు తగలబడసాగాయి. ప్లాస్టిక్ వస్తువులు కావడంతో ఘాటైన వాసనతో కారుమబ్బుల్లా పొగలు ఆ ప్రాంతాన్ని దట్టంగా కమ్మేశాయి. స్థానికుల సమాచారంతో హుటాహుటిన అగ్నిమాపక శాఖాధికారులు, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నెల్లూరులో వున్న ఫైరింజన్‌లనే కాకుండా చుట్టుపక్కల మండలాలల నుండి కూడా ఫైరింజన్‌లు తెప్పించారు. 9 ఫైరింజన్‌లతో నీళ్లు కొట్టినా మంటలు అదుపులోకి రాలేదు. దాదాపు 25 మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌ల ద్వారా అప్పటికప్పుడు నీళ్ళు తెప్పించుకుంటూ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఆదివారం రాత్రి మొదలైన మంటలు సోమవారం మధ్యాహ్నానికి గాని అదుపులోకి రాలేదు. మంటలను అదుపులోకి తేవడానికి దాదాపు 18గంటల పాటు శ్రమించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆ చుట్టుపక్కల వారిని ఖాళీ చేయించారు. ఆ భవనంలోని మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

సోమవారం ఉదయం ఈ భవనంలో నుండి వస్తున్న పొగను చూస్తే అవి కూడా మబ్బులు కమ్మినట్లుగానే అనిపించాయి. ఆ ప్లాస్టిక్ తగలబడిన వాసన అక్కడనుండి దాదాపు రెండు కిలోమీటర్ల వరకు వ్యాపించింది. జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, ఎస్పీ ఐశ్వర్యరస్తోగి హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేసేలా అధికారయంత్రాంగాన్ని కదిలించారు.

### శ్రమించిన అధికారులు

భారీ అగ్నిప్రమాదం నేపథ్యంలో మంటలు అదుపుచేయడానికి అధికారులు చేసిన ప్రయత్నాలు అభినందనీయం. ప్రమాదం గురించి తెలియగానే జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డితో పాటు నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ సిఐలైన మధుబాబు, వేమారెడ్డి, శ్రీరాములునాయక్, నాగేశ్వరమ్మ, సుబ్బారావు, సోమయ్య, అలాగే స్పెషల్ బ్రాంచ్ సి.ఐ శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీసు అధికారులు, ఆర్డీవో, కార్పొరేషన్ కమిషనర్ తదితరులంతా సంఘటనా స్థలంలోనే రాత్రంతా ఉండి మంటలను అదుపుచేయడానికి తీవ్రంగా శ్రమించారు.

### కాపాడిన మందిరాలు

అగ్ని ప్రమాదం సంభవించిన దుకాణానికి ఒకవైపు రామమందిరం, ఇంకోవైపు మసీదు ఉండడంతో పెద్దప్రమాదం తప్పింది. అదే ఇరువైపులా ఇళ్ళు గాని, లేదా దుకాణాలుగాని వుంటే మంటలు వ్యాపించడానికి అవకాశం వుండేది. రెండుపక్కలా మందిరాలు వుండడంతో మంటలు వ్యాపించకుండా అవి రక్షణ గోడలుగా నిలిచాయి.



### పరామర్శించిన అనిల్

తన నియోజకవర్గ పరిధిలో అగ్నిప్రమాదం సంభవించడంతో, మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుడైన అశోక్‌సింగ్‌ను పరామర్శించాడు. అలాగే మాజీమేయర్ అబ్దుల్ అజీజ్, వైసిపి నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, తదితరులు దుకాణ యజమానిని ఓదార్చారు.

- భారతీయ జనతా పార్టీ

# గాంధీ లేని.. గాంధీయాత్ర




**పార్టీ అధిష్టానం పిలుపు మేరకు జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతాపార్టీ నెల్లూరుజిల్లా శాఖ కూడా అత్యంత ఆడంబరంగా 'గాంధీజీ సంకల్పయాత్ర'ను నెల్లూరులో నిర్వహించింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులు పాల్గొన్న కార్యక్రమం కోసం జిల్లా అంతా ఏర్పాటు చేసిన భారీ ప్రచార ఫ్లెక్సీలలోనూ, హోర్డింగులలోనూ ఎక్కడా మహాత్మాగాంధీ ఫోటోనే కనపడకపోవడం విశేషం! యాత్రలో భాగంగా నాయకులు చేతబట్టిన బ్యానర్లో మాత్రం బాపూజీ దర్శనమిచ్చాడు.**



ఇక వివరాల్లోకి వెళితే...

మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని భారతీయ జనతాపార్టీ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 15వ తేదీ నుండి మొదలుపెట్టిన గాంధీజీ సంకల్పయాత్ర 28వ తేదీతో ముగిసింది. ముగింపు రోజున నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నుండి మొదలైన యాత్ర గాంధీబొమ్మ వరకు సాగింది. ఈ యాత్రలో బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి వై.సత్యకుమార్, టిడిపి నుండి బీజేపీలోకి జంప్ చేయబడ్డ రాజ్యసభసభ్యులు వై.సుజనాచౌదరి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీబొమ్మ వద్ద ఏర్పాటు చేసిన ముగింపుసభలో సత్యకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ గాంధీ పేరును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటే, బీజేపీ మాత్రం ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తోందన్నారు. ఎంపి సుజనాచౌదరి మాట్లాడుతూ జాతీయ పార్టీ అయిన బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు యువత పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు.

బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కందుకూరు సత్యనారాయణ, ఆర్.డి.విల్సన్, భరత్‌కుమార్, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మొగలాల సురేష్, కరణం భాస్కర్, కె.జగన్మోహన్‌రావు, ఎం.ఈశ్వరయ్య, జనార్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన నెల్లూరు పార్లమెంట్

# ఇన్‌ఛార్జ్‌గా మనుక్రాంత్



జనసేన నెల్లూరు పార్లమెంటు ఇన్‌ఛార్జ్‌గా చెన్నారెడ్డి మనుక్రాంత్‌ను పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నియమించాడు. మనుక్రాంత్ ఇప్పటికే పార్టీ అధికార ప్రతినిధిగా, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా వున్నాడు. జిల్లాలో నెల్లూరు సిటి, నెల్లూరు రూరల్, కోవూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించకపోవడంతో తాత్కాలికంగా ఆ మూడు నియోజకవర్గాల బాధ్యతలు కూడా మనుక్రాంత్‌కే అప్పగించారు. ఈ సందర్భంగా మనుక్రాంత్ మాట్లాడుతూ తమ నాయకుడు పవన్‌కళ్యాణ్ తనపై పెట్టిన బాధ్యతలను సమర్ధవంతంగా నెరవేరుస్తానని చెబుతూ, ఈ బాధ్యతలు అప్పగించినందుకు పవన్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

## నవంబర్ 1 నుంచి...

# రెండోవిడత 'వైఎస్సార్ కంటి వెలుగు'

### - పటిష్టంగా నిర్వహించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు ఆదేశాలు



వైఎస్సార్ కంటివెలుగు రెండోవిడత కార్యక్రమాన్ని నవంబర్ 1వతేది నుంచి డిసెంబర్ 31వ తేది వరకు ప్రణాళికాబద్దంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. గతనెల 28న తన క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలి విడతకు సంబంధించి 3,89,162 మంది విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించాల్సి ఉంటే, ఇప్పటిదాకా 3,66,094 మందికి నిర్వహించామని, వీరిలో 27,189 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఆత్మకూరు, నాయుడుపేట, కావలి, గూడూరు, నెల్లూరు రెవిన్యూ డివిజన్లలోని మండల పాఠశాల కాంప్లెక్స్‌ల్లో పారామెడికల్ నేత్రవైద్యులు విద్యార్థులకు రెండోసారి కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 280 ప్రాంతాల్లో విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహిస్తారని, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా ఈ కార్యక్రమం సజావుగా పూర్తయ్యేందుకు సహకరించాలని ఆదేశించారు. విద్యార్థులకు మధ్యాహ్నభోజనం ఏర్పాటుచేయాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు, కంటి అద్దాలు పంపిణీ చేయాలని, కంటిపరీక్షలు నిర్వహించే వైద్యులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జేసీ-2 కమలకుమారి, డిఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి, డిసిహెచ్ఎస్ డాక్టర్ సుబ్బారావు, ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ శ్రీనివాస్, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ మనోరమ పాల్గొన్నారు.



# కల్యాణ వైభవం...!




గూడూరు వాస్తవ్యులు పట్నం శ్రీనివాసులు - కీ.శే. పద్మావతిల కుమారుడు రవితేజ - సుస్మిత (విజయనగరం వాస్తవ్యులు పిన్నింటి వెంకటరమణ - విజయలక్ష్మిల కుమార్తె)ల కల్యాణం అక్టోబర్ 23వ తేదీన విజయనగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్‌లో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# గూడూరు డివిజన్ వార్తలు

### అన్యాక్రాంతమైన భూములను

## ఆక్రమణల చెరనుంచి విడిపించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులు, బాధితులు

ప్రభుత్వం పంచిన భూములు అన్యాక్రాంతమయ్యాయని, ఆక్రమణల చెరనుంచి వాటిని విడిపించాలని బాధితులు కోరారు. ఆమేరకు వారు గత నెల 28న గూడూరులోని సిపిఐ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 'స్పందన'లో సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వెంకటగిరి మండలంలో పేదలకు చెందిన భూములను కొందరు ఆక్రమించుకొని, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు సైతం పేదలపైనే అక్రమకేసులు బనాయిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## మానవత్వం చాటుకున్న సబ్ కలెక్టర్



మహిళను ఆసుపత్రిలో చేర్పిన సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ

కళ్ళముందే ప్రమాదం జరిగినా మనకెందుకులే అని చూసీచూడనట్లు వెళ్ళిపోతున్న నేటి రోజుల్లో, గాయపడి అసహాయస్థితిలో ఉన్న ఒక మహిళను మానవత్వంతో ఆసుపత్రికి చేర్చి గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ అందరి ప్రశంసలకు పాత్రమయ్యారు. మనుబోలు మండల పరిధిలో ఈ సంఘటన గతనెల 26న జరిగింది. ఇందు కూరుపేటకు చెందిన ఇటుకల ప్రసన్న, తన కుటుంబ సభ్యునితో కలిసి మోటర్‌బైక్‌లో వెనుక కూర్చుని గూడూరుకు వెళ్తుండగా, మార్గమధ్యంలో అదుపు తప్పి కిందపడిపోయింది. అది గమనించని కుటుంబసభ్యుడు ముందుకు వెళ్ళిపోయాడు. కొద్దిసేపట్లోనే అదే మార్గంలో వస్తున్న గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ హైవే పక్కన నిస్సహాయస్థితిలో పడివున్న ఆ మహిళను గమనించారు. వెంటనే తన వాహనంలో తీసుకువెళ్ళి ఆస్పత్రికి చేర్చి మానవత్వం చాటుకున్నారు. అప్పటికే ఆమె అపస్మారక స్థితిలో ఉండడంతో ఆమెను వెంటనే మనుబోలు పిహెచ్‌సికి తీసుకువెళ్ళారు. అక్కడ వైద్యులు ఆమెకు ప్రాథమిక చికిత్స చేశారు. అయినా ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో సబ్‌కలెక్టర్ నెల్లూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం ఆమెను నెల్లూరుకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. అంతకు కొద్దిసేపటికి ముందు ఈ సమాచారం తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యుడు వెంటనే మనుబోలు ఆస్పత్రికి వచ్చి ఆమె వెంట ఆసుపత్రికి వెళ్ళాడు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

## ఫలసరుకుల పంపిణీ




ఫలసరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతనెల 28న మయూరి శ్యామ్‌యాదవ్, సుబ్రహ్మణ్యం, శేగు ప్రసాద్ దాతృత్వంతో సొసైటీలో ఉన్న స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ మానసిక దివ్యాంగులకు 3 బస్తాల బియ్యం, నెలసరి ఫలసరుకులు పంపిణీ చేశామని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు టౌన్ సిఐ దశరధరామారావు పాల్గొని వారి చేతుల మీదుగా ఆ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. కార్యదర్శి కడివేటి చంద్రశేఖర్, మదనమేటి రమణయ్య, ఎం.మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్, కుమార్, నిర్మల, సభ్యులు పాల్గొన్నారు.

### ప్రజల సమస్యలు

## త్వరితగతిన పరిష్కరిస్తాం

**- తహశీల్దార్ లీలారాణి**



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ లీలారాణి అన్నారు. గూడూరు పట్టణంలోని తమ కార్యాలయంలో ఆమె గతనెల 28న 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. గూడూరు మండలంలోని వివిధగ్రామాల ప్రజలు ఈ సందర్భంగా పలు సమస్యలపై తహశీల్దారుకు వినతి పత్రాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూ సమస్యలు, రేషన్ కార్డులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణముఖికి నీరు వదలండి

**- మంత్రిని కోరిన గూడూరు ఎమ్మెల్యే**

తెలుగుగంగ కాలువ ద్వారా స్వర్ణముఖి బ్యారేజీకి 3టిఎంసీల నీటిని విడుదల చేయాలని గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌రావు జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను కోరారు. గత నెల 29వ తేదీన నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వరప్రసాద్ మంత్రిని కలిసి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 20వేల ఎకరాలలో పంటను వేసుకునేందుకు ఈ నీటిని విడుదల చేయాలని ఆయన కోరారు. స్వర్ణముఖి బ్యారేజీ ఎత్తును ఇంకో ఒకటిన్నర అడుగు పెంచితే చుట్టుపక్కల చెరువుల్లోకి నీళ్ళు చేరే అవకాశాలున్నాయని, అందుకోసం నిధులు మంజూరు చేయాలని, అలాగే గూడూరు నియోజకవర్గంలో ఇంకా కొన్ని చెరువులు నిండలేదని, వాటిని కూడా నింపాలని ఆయన మంత్రిని కోరాడు.

### ఆంధ్రమహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో

## పేద విద్యార్థులకు దుస్తులు




పిల్లలకు దుస్తులు, విద్యాసామగ్రిని అందజేస్తున్న డాక్టర్ సి.రోహిణి

దీపావళి పండుగను పురస్కరించుకుని గూడూరు మండలంలోని గాంధీనగర్ సాయిబాబా మందిరం ప్రాంగణంలో ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పేద పిల్లలకు దుస్తులు, విద్యాసామగ్రిని అందజేశారు. గత నెల 27న జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ పేదపిల్లలను ఆదుకునేందుకు దాతలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న సాయిబాబా మందిరానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు జీవని, ప్రభారెడ్డి, విష్ణు వందన తదితరులు పాల్గొన్నారు.

### ఎయిర్‌పోర్ట్ అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా

## ఎల్లసిరి రాజీవ్

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అడ్వయిజరీ కమిటీ తిరుపతి ఎయిర్‌పోర్టు విభాగానికి గూడూరుకు చెందిన ఎల్లసిరి రాజీవ్ మెంబర్‌గా ఎంపికయ్యారు. ఈయన బెంగుళూరులో నివాసం ఉంటున్నారు. ఈ కమిటీ సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ నియమనిబంధనల మేరకు పని చేస్తుంది. ఈ కమిటీకి తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాద్‌రావు ఛైర్మన్‌గా ఉన్నారు.

### వేనాడు దర్గా

## గంధ మహోత్సవం

నెల్లూరు జిల్లా తడ మండలంలోని వేనాడు దర్గా 24 వ గంధ మహోత్సవం నవంబర్ 4వ తేదీన నిర్వహించనున్నారు. ప్రతి ఏటా జరిగే ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండే కాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి కూడా వేలమంది భక్తులు వస్తుంటారు. సూళ్ళూరుపేట నుండి ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. దర్గా కమిటీ అన్ని వసతులు ఏర్పాటు చేస్తోంది.

## ప్రభుత్వ ఉద్యోగులకు సన్మానం



సైదాపురం ఎలక్ట్రిసిటీ లైన్‌మెన్ పసబాక యతిరాజులును సన్మానిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో నిబద్ధత చూపిన ప్రాథమిక స్థాయి ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి గౌరవించే కార్యక్రమంలో భాగంగా నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు అయిన కానిస్టేబుల్ చిరంజీవి, సైదాపురంలో ఎలక్ట్రిసిటీ లైన్‌మెన్‌గా ఉన్న పసబాక యతిరాజులు, ఆర్టీసీ డ్రైవర్ వి.శేషయ్య, పారిశుద్ధ్య కార్మికుడు టి.శ్రీనివాసులును గతనెల 29న రోటరీ భవనంలో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాల్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పసుపులేటి మునిరాజా మాట్లాడుతూ ఇటువంటి సన్మానాలు సహోద్యోగులకు కూడా స్ఫూర్తిదాయకంగా ఉంటాయని, ఆయా శాఖల సేవలు ప్రజలకు మరింతగా అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిజి బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, బి.దశరథరామిరెడ్డి, కె.మునిగిరీష్, వెంకటేశ్వర్లురెడ్డి, కో-ఆర్డినేటర్ పి.రామకృష్ణా రెడ్డి, కె.సుందరరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, ఎస్వి.అశోక్‌చక్రవర్తి పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను తోడేస్తున్నారు

## ముత్తుకూరు జనసేన నాయకులు



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జనసేన నాయకులు

ముత్తుకూరు మండలంలోని పంటపాలెం, పరిసర గ్రామాలలో కొందరు అక్రమంగా బోర్లు వేసి భూగర్భ జలాలను ఫ్యాక్టరీలకు అమ్ముకుంటున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముత్తుకూరు జనసేన నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నారెడ్డి మనుక్రాంత్ ఆదేశాల మేరకు వారు తహశీల్దార్‌ను కలిసి ఇక్కడ జరుగుతున్న భూగర్భ జలాల దోపిడీని గురించి వివరించారు.

# దీపావళి పురస్కారాలు

నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గతనెల 26న నెల్లూరు టౌన్‌హాలులోని రీడింగ్‌రూంలో దీపావళి పురస్కారాలు, దీపావళి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి జంజం కోదండరామయ్య, బ్రహ్మయ్య ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు బట్టేపాటి సిద్దేశ్వరరావులను శాలువా, పూలమాలలతో దీపావళి పురస్కారాలను నెరసం అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎ.జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ అందజేశారు. సభకు జయప్రకాష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా జిల్లా ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ ఎం.అబ్రహం, నారాయణ డెంటల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కణ్ణన్, పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణను నెరసం ప్రధానకార్యదర్శి పాతూరి అన్నపూర్ణ నిర్వహించారు. కవి సమ్మేళనంలో అవ్వారు శ్రీధర్‌బాబు, పేరంశెట్టి శివకుమార్, బొగ్గరపు ఇందిరాకృష్ణ, షేక్ నజ్మాబేగం, సోలా జానకీదేవి, వేదం సూర్యప్రకాష్ తదితర 40మంది కవులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో త్వరలో..

# వెయ్యి విద్యుత్ బస్సులు

## - ఆర్టీసీ ఇ.డి గోపీనాథ్‌రెడ్డి

రాష్ట్రంలో త్వరలో వెయ్యి విద్యుత్ బస్సులను నడిపేందుకు సమాయత్తమవుతున్నామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి చెప్పారు. రాపూరు ఆర్టీసి డిపోను గత నెల 26న ఆయన సందర్శించిన సందర్భంగా మాట్లాడుతూ ఇందులో తొలివిడతగా 150 విద్యుత్ బస్సులను తిరుపతి–తిరుమల మధ్య నడపడం జరుగుతుందని చెప్పారు. నెల్లూరు నుంచి రాపూరు మీదుగా కడపకు కూడా విద్యుత్ బస్సును నడిపే ప్రతిపాదన ఉందన్నారు. ఆర్టీసీ ప్రస్తుతం నష్టాల్లో ఉందని, దీనిని లాభాల బాటలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. శబరిమల అయ్యప్ప స్వాములు ప్రయాణించే బస్సుల్లో ఇకపై ఏడుగురికి ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తామని, ఆర్టీసీ బస్‌లను బుక్ చేసేవారికి 2వేల రూపాయలు పారితోషికంగా అందజేస్తామని, వీటి వివరాల కోసం సంబంధిత ఆర్టీసీ డిఎంను కలవాలని తెలిపారు. అనంతరం ఆర్టీసీలోని అన్ని యూనియన్ల నాయకులు ఇ.డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రామమ్, డిపో మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మద్యపానం అనర్థదాయకం

## ఎక్సైజ్ డీసీ రాధయ్య

మద్యపానం అన్ని అనర్థాలకు మూలమని, ఆ వ్యసనానికి బానిసలు కాకుండా అందరూ దూరంగా ఉండాలని ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ రాధయ్య పేర్కొన్నారు. గత నెల 26న నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన 'జాగృతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మద్యం తాగడంతో పేదల కుటుంబాలు నానారకాల సమస్యలతో అల్లాడిపోతున్నాయని, మద్యాన్ని సేవించడం మానుకోవాలని ఆయన సూచించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు శ్రీనివాసాచారి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

అనారోగ్యంతో గత ఏడాది డిసెంబరులో మరణించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ యాజాస్ అహ్మద్ కుటుంబానికి ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది నుంచి సేకరించిన 81వేల రూపాయల ఆర్థికసాయాన్ని ఈ సందర్భంగా డిప్యూటి కమిషనర్ రాధయ్య చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రమూర్తి, నెల్లూరు–గూడూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు శ్రీనివాసాచారి, వెంకటరామిరెడ్డి, అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు శీనయ్య, కార్యదర్శి దయాకర్, కోశాధికారి కిరణ్‌సింగ్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు ఆసిఫ్‌బేగ్, మినిస్టీరియల్ సంఘం అధ్యక్షుడు నళినీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పగుడిలో అభివృద్ధి పనులు

నెల్లూరు వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో కేరళలోని శబరిమలై స్థాయిలో భక్తులు ఇరుముడులు సమర్పించుకునేలా దేవస్థానం పాలకమండలి దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ 29న అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. పవిత్రమైన 18 మెట్లను కృష్ణశిలపై చెక్కారు. ఈ పనులు కేరళలో జరిగాయి. దాదాపు 30 టన్నుల బరువున్న ఈ మెట్లను భారీ క్రేన్ సహాయంతో ఆలయంలో దించారు. రెండు చిన్న ఆలయాలు, ఆలయం ముందు ప్రాకారం తదితర నిర్మాణాలు జరుగుతున్నాయి. త్వరలో 18 మెట్ల స్థాపన కార్యక్రమాన్ని పూర్తిచేయనున్నారు.

# బీజేపీ గెలుపు వెనుక రాహుల్ హస్తం

శ్రీను గల్పిక

ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, వర్కింగ్ ప్రెసిడెంట్ జె.పి.నడ్డా, సీనియర్ నేతలు అద్వానీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్, పీయుష్‌గోయెల్, మహారాష్ట్ర మాజీసీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌లు సమావేశమైవున్నారు. అప్పుడే శివసేన చీఫ్ ఉద్ధవ్‌ధాకరే లోపలకు వచ్చాడు. ఏం ఇలా వచ్చారని అమిత్‌షా అడిగాడు. మహారాష్ట్ర సీఎం సీటు విషయం ఏదో ఒకటి తేల్చండి. రెండున్నరేళ్లు సీఎం కుర్చీలో మీరుంటే రెండున్నరేళ్లు మాకు కావాలి. ఒట్టి మాట చెబితే సరికాదు... ఆ విధంగా ఒక అగ్రిమెంట్ వ్రాసుకుందాం. దీనిని రిజిస్ట్రార్ ఆఫీసుకు తీసుకెళ్లి రిజిష్టర్ చేయిద్దాం. దానిపై అద్వానీ, సోనియాగాంధీ వంటి సీనియర్ నేతల చేత సాక్షి సంతకాలు చేయిద్దామని చెప్పాడు. ఆ ప్రతిపాదనకు అమిత్‌షాకు చిర్రెత్తుకొచ్చింది. మేం ఇంకా మహారాష్ట్ర సీఎం సీటుపై ఓ నిర్ణయం తీసుకోలేదు, నిర్ణయం తీసుకున్నాక మీకు కబురు చేస్తాం, అప్పుడు రండని చెప్పి ఆయనను పంపించేశాడు. తర్వాత అమిత్‌షా వుండి... ఈ శివసేనతో పొత్తు పెట్టుకుని దారినపోయే తలనొప్పిని బ్యానర్ పెట్టి, బ్యాండ్ మేళం కొట్టి మనమే ఆహ్వానించామేమోననిపిస్తోంది. అసలు మనకే సొంతంగా మెజార్టీ వచ్చుంటే ఈ తలనొప్పంతా వుండేది కాదేమోనన్నాడు. నరేంద్ర మోడీ అందుకుని... నేనైతే మహారాష్ట్రలో మన పార్టీకే పూర్తి మెజార్టీ వస్తుందనుకున్నా, ఎగ్జిట్‌పోల్స్ కూడా అలాగే వచ్చాయి కదా అని అన్నాడు. దేవేంద్ర ఫడ్నవీస్ వుండి... ఆ శివసేనతో పొత్తు లేకపోయివుంటే మనకే పూర్తి మెజార్టీ వచ్చి వుండేదేమో! అనవసరంగా పొత్తు పెట్టుకున్నామన్నాడు. అందుకు అమిత్‌షా... మన ప్రయత్నాలలో తప్పు లేదు. మనం అధికారం కోసం ఏది చేయాలో అదంతా చేశాం. ఆ రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా కూడా వుండదనుకున్నాం... అన్ని సర్వే సంస్థలు కూడా అదే అంచనా వేశాయి. కాని జరగరానిదేదో జరిగిపోయింది. మనం వూహించిన దానికన్నా మనకు ఫలితాలు తగ్గడం, కాంగ్రెస్‌కు అనుకున్న దానికన్నా మెరుగైన ఫలితాలు రావడం వెనుక ఏదో మిస్టరీ వుంది. ఆ మిస్టరీ ఏదో ఛేదించాలి... వెంటనే ఇంటలిజన్స్ చీఫ్ అజిత్ దోవల్‌ను పిలిచి దీని మిస్టరీ ఏదో కనుక్కుంటానని చెప్పి లేచాడు. ఆరోజుకు అదే పెద్ద టాస్క్ కావడంతో ఆ మిస్టరీ ఏదో తెలిశాక మళ్ళీ కలుద్దామంటూ లేచారు.

★★★★★

టెన్‌జనపథ్‌లో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గులాంనబీ ఆజాద్, దిగ్విజయ్ సింగ్, అహ్మద్‌పటేల్, మనీష్ తివారి, కపిల్‌సిబల్, మల్లిఖార్జున ఖర్గేలు సమావేశమైవున్నారు. అందరి ముఖాలలోనూ ఆనందం తాండవిస్తోంది. అప్పుడే విహెచ్ హనుమంతురావు స్వీట్లు తెచ్చి అందరికీ ఇవ్వసాగాడు. దిగ్విజయ్‌సింగ్ వుండి... మహారాష్ట్ర, హరియాణలలో మన పార్టీ అనూహ్యంగా పుంజుకుంది మేడమ్... అసలు మీరు కాని బాబు కాని ప్రచారం చేయకుండానే ఇన్ని సీట్లు వచ్చాయంటే, ఇక మీరు ప్రచారానికి దిగుంటే ఆ రెండు రాష్ట్రాల్లో అధికారం మనదే అయ్యుండేదని చెప్పాడు. మల్లిఖార్జునఖర్గే వుండి... ఎగ్జిట్‌పోల్స్ అతిగా అంచనా వేశాయి. మన పార్టీ ఆ రెండు రాష్ట్రాలలో ఎంతో ఘోరంగా ఓడిపోతుందనుకున్నా... కాని తీరా చూస్తే భలే బాదేసింది. అరె... ఇంకొంచెం కష్టపడి వుంటే, మీరూ, రాహుల్‌బాబు విచ్చలవిడిగా ప్రచారం చేసుంటే రెండు రాష్ట్రాలు మన ఖాతాలో పడివుండేవని అన్నాడు. అంతలో సోనియా... ఈ రెండు రాష్ట్రాలలో బీజేపీ ఏ విధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందో, మహారాష్ట్రలో శివసేనతో వాళ్ళ అగ్రిమెంట్ ఎంతవరకు వచ్చిందో చూద్దాం అంటూ టీవీ ఆన్ చేసి 'రిపబ్లిక్' ఛానెల్ పెట్టింది. అందులో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఇంటర్వ్యూ వస్తోంది... మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల ఫలితాలపై మీ అభిప్రాయం ఏంటని రిపబ్లిక్ ఛానెల్ ఎడిటర్ ఇన్ చీఫ్ అర్నబ్ గోస్వామి అడిగాడు. దానికి అమిత్‌షా... ఫలితాల పట్ల ఒకరకంగా ఆనందంగానూ ఇంకో రకంగా బాధగానూ వుంది. మేం అనుకున్నదాని కంటే ఫలితాలు తక్కువ వచ్చినందుకు బాధగా వుంది. అదే సమయంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు ప్రచారం చేయకపోవడం వల్లే మాకు ఈ మాత్రం ఫలితాలు వచ్చి ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలుగుతున్నందుకు ఆనందంగా వుంది. మరీ ముఖ్యంగా ఆ రాహుల్‌గాంధీ ఈ రెండు రాష్ట్రాలలో ప్రచారం చేసుంటే కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసేది. మా పార్టీ వాష్‌ఔట్ అయ్యేది అని చెప్పాడు. ఛానెల్‌లో ఈ ఇంటర్వ్యూ చూస్తున్న సోనియాకు అమిత్‌షా తమ గురించి, మరీముఖ్యంగా రాహుల్ గురించి అంత పాజిటివ్‌గా మాట్లాడుతుండేసరికి మనసులో ఏదో అనుమానం రేగింది. ఇంటర్వ్యూ చూశాక గులాంనబీ ఆజాద్, దిగ్విజయ్‌సింగ్, మనీష్ తివారీలు మాత్రం చూశారా మేడమ్... అమిత్‌షా కూడా అదే విషయం చెప్పాడు. మీరిద్దరూ ఆ రెండు రాష్ట్రాలలో ప్రచారం చేసుంటే బీజేపీకి పరాభవం, మనకు అధికారం వచ్చేదన్నారు. అప్పుడు సోనియా... లేదు... ఆ అమిత్‌షా మాటలు నమ్మడానికి లేదు... మా గురించి అతను అంత పాజిటివ్‌గా మాట్లాడుతుంటేనే ఏదో అనుమానంగా వుంది. అతని మాటల వెనుక ఏదో మిస్టరీ వుంది. ఆ రెండు రాష్ట్రాల ఎన్నికల్లో ఏదో మిస్టరీ పని చేసింది. అది నాకు తెలియాలి అని అంటుండగా... అప్పుడే అక్కడకు కమల్‌నాథ్ వచ్చాడు. ఆయాసపడుతున్నాడు. సోనియాతో ఆయన... ఉంది మేడమ్... మీరు అనుమానిస్తున్నట్లే మిస్టరీ వుంది. అది ఈ ఫోన్‌లోనే వుంది. ఇప్పుడే బీజేపీ ఆఫీసులో సీక్రెట్‌గా షూట్ చేసి తీసుకొస్తున్నా అని చెప్పి తన చేతిలో వున్న సెల్‌ఫోన్ సోనియా చేతిలో పెట్టి గ్యాలరీ ఓపెన్ చేసి ఓ వీడియో ఆన్ చేశాడు. దానిని అందరూ చూడసాగారు.

బీజేపీ కార్యాలయంలో మోడీ, అమిత్‌షా, నడ్డా, ప్రకాష్ జవదేకర్‌లు కూర్చుని వుండగా ఇంటలిజన్స్ చీఫ్ అజిత్ దోవల్ లోపలకు వచ్చాడు. నేను చెప్పిన పని ఏమైందని అమిత్‌షా అడిగాడు. దానికి అతను... మీరు చెప్పినట్లే ఆ మిస్టరీని కనిపెట్టాను సార్... ఆ మిస్టరీ పేరు రాహుల్‌గాంధీ. గత కొన్నేళ్లుగా రాహుల్‌గాంధీ ట్రాక్‌రికార్డును పరిశీలించాం. ఆయన కాంగ్రెస్‌కు ప్రచారం చేసిన అన్ని ఎన్నికలలోనూ, అన్ని రాష్ట్రాలలోనూ బీజేపీయే గెలుస్తూ వచ్చింది. కాని, ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల్లో మాత్రం నిస్పృహవల్లనైతేనేమి, యాధృచ్ఛికంగా అయితేనేమీ ఆయన ప్రచారం చేయలేదు. దాంతో ఆ రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకుంది అని చెప్పాడు. రాహుల్ ప్రచారం చేయకపోవడం వల్ల మేమెందుకు నష్టపోతామని అమిత్‌షా అడిగాడు. అందుకు ఇంటలిజన్స్ చీఫ్ అజిత్ దోవల్... రాహుల్ ప్రచారంలో ఏదో ఒకటి వాగేస్తాడు. అతని నోటి నుండి దొర్లిన పొరపాటు మాటను మీరు క్యాచ్ పట్టేసి దానికొక జాతీయ వివాద అంశంగా మలుస్తారు. చివరకు ఎలక్షన్‌లు దానిమీదే జరిగి మీకు లబ్ది చేకూరేది. ఈసారి రాహుల్ ప్రచారానికి రాకపోవడంతో మీకు అలా రెచ్చగొట్టి ఓట్లు రాబట్టే అవకాశం లేకుండాపోయిందని చెప్పాడు. అలాగైతే, వాళ్లను రెచ్చగొట్టి లేదంటే పొగిడైనా ఈసారి నుండి వాళ్లను ఎన్నికల ప్రచారానికి వచ్చేలా చేస్తానని అమిత్‌షా మోడీకి మాటిచ్చాడు.

ఇక్కడితో ఆ వీడియో అయిపోయింది. అంతా చూశాక సోనియా ఈ ఫలితాల వెనుక ఇంత మిస్టరీ వుందా... కాంగ్రెస్ బలపడుతుం దంటే రాహుల్‌ను ఎన్నికల ప్రచారానికి కాదు కదా, ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయడానికి కూడా పంపించను అని చెప్పి లేచింది.



సూళ్లూరుపేటలోని చెర్రీస్ కిచెన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 'కుంభకోణం డిగ్రీ కాఫీ షాప్'ని అక్టోబర్ 30వ తేదీన ప్రారంభిస్తున్న సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య. 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులు

# 'దేశం' నేతల ఇసుక దీక్ష

ఇసుక కొరతతో ఇబ్బందులుపడుతున్న భవన నిర్మాణ కార్మికులకు మద్దతుగా మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ బుధవారం నెల్లూరు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒకరోజు దీక్ష నిర్వహించాడు. తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సాయంత్రం 5గంటల సమయంలో దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్ష చేస్తున్న నాయకులకు సంఘీభావం తెలిపాడు. నిమ్మరసం ఇచ్చి అందరిచేత దీక్ష విరమింపజేశాడు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పరిస్థితులు అస్తవ్యస్థంగా మారాయని, పల్లెల్లో మరుగుదొడ్ల నుండి పోలవరం ప్రాజెక్ట్ దాకా ఏ పని కూడా జరగకూడదనే దుర్మార్గమైన ఆలోచనలతో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నాడు. తెలుగుదేశం ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల ద్వారా ఇసుకను ప్రజలకు పూర్తిగా అందుబాటులో వుంచామని, అప్పుడు ట్రాక్టర్ ఇసుక వెయ్యి నుండి 1200 రూపాయలులోపే లభించగా, ఇప్పుడు ట్రాక్టర్ ఇసుక 4వేల రూపాయలకు చేరిందని ఆరోపించాడు. ఇసుక లేక భవననిర్మాణ కార్మికులు ఆర్నెల్లుగా పనులు లేక పస్తులుంటున్నారని, వారి బాధలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతుందని సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లాలో ఇసుక మాఫియా చెలరేగిపోతోందని వైసిపి ఎమ్మెల్యేలే విమర్శలు చేస్తుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించాడు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని భవన కార్మికుల సమస్యలను గుర్తించి తెలుగుదేశం ప్రభుత్వంలో లాగే ఇసుకను ఉచితంగా అందజేయాలని ఆయన డిమాండ్ చేశాడు.



నిమ్మరసం ఇచ్చి అజీజ్ చేత దీక్షను విరమింపజేస్తున్న సోమిరెడ్డి

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, సిహెచ్ హరిబాబుయాదవ్, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జెన్ని రమణయ్య, ఉచ్చి భువనేశ్వర్రప్రసాద్, కిలారి వెంకటస్వామినాయుడు, తిరుమలనాయుడు, అమృల్లా, మామిడాల మధు, పిఎల్ రావ్, శ్రీపతిబాబు, జలదంకి సుధాకర్, కప్పిర శ్రీనివాసులు, బి.మనోహర్‌రెడ్డి, పి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ కాలేజీని సందర్శించిన మంత్రి



రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ అక్టోబర్ 29వ తేదీన నెల్లూరులోని చారిత్రక వీఆర్ కళాశాలను సందర్శించాడు. ఆయన వెంట గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కళాశాల ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్, వైసిపి రూరల్ కార్యాలయ సమన్వయకర్త కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పూర్వవిద్యార్థుల నాయకులు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ వీఆర్ కళాశాల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, ఈ విద్యాసంస్థ పూర్వవైభవానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డితో చర్చించి ఈ కళాశాల అభివృద్ధికి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నాడు. కళాశాల కమిటీ ఎన్నికల కోసం గతంలో 83మంది నామినేషన్లు వేశారని, జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ఈ 83మంది నుండి కొందరితో కమిటీ ఏర్పాటు చేయాలని, కమిటీ ఆధ్వర్యంలో కళాశాల మంచి చెడ్డలు చూసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పాడు.

# ఆరనీకుమా ఈ దీపం.. కార్తీక దీపం

## - వేడుకగా కార్తీక మాసోత్సవాలు

కార్తీకమాసం ఎంతో పుణ్యప్రదమైనదని మన ప్రాచీనశాస్త్రాలు పేర్కొంటున్నాయి. కృత్తికా నక్షత్రంలో పూర్ణచంద్రుడు సంచరించే రోజు కావడం వల్ల దీనిని కార్తీకమాసమని అంటారు. కార్తీకంతో సమానమైన మాసం లేదని పురాణాల ప్రశస్తి. ఇంత పవిత్రమైన, మహిమాన్వితమైన మాసం కనుకనే ఈ మాసంలో పరమేశ్వరునికి, మహావిష్ణువుకు పూజలు చేయడం మరెంతో శుభప్రదమని, అంతేకాక కార్తీకమాసంలో దీపారాధనలు చేయడం, దీపదానం చేయడం ఎంతో పుణ్యప్రదమని శాస్త్రాలు చెప్తున్నాయి. ఈ మాసంలో పరమశివుని పూజిస్తే గ్రహబాధలు, ఈతిబాధల నుంచి విముక్తి కలిగి సకల శుభాలు కలుగుతాయని శాస్త్రవచనం. పరమశివునికి ఎంతో ప్రీతిపాత్రమైన ఈ కార్తీకమాసంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న శివకేశవాలయాల్లో వైభవోపేతంగా పూజలు ప్రారంభమయ్యాయి. ఇక నెల్లూరు నగరంలోనైతే శివాలయాలన్నీ కార్తీక దీపారాధనలతో కళకళలాడుతున్నాయి.

**విశేషపూజలతో అలరారుతున్న శివాలయాలు..**

కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా గతనెల 28న నెల్లూరు నగరంలో కార్తీక దీపోత్సవాలు ఎంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదిదంపతులైన పార్వతీపరమేశ్వరులకు విశేషపూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయాల్లో వేలసంఖ్యలో భక్తులు బారులు తీరి సదాశివుని దర్శించుకుంటున్నారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు చేసి ఆకాశదీపాలను వెలిగించారు.



మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు విచ్చేసి కార్తీకదీపాలు వెలిగించారు. నగరంలోని మూలాపేటలో ఉన్న శ్రీ మూలస్థానేశ్వరాలయం, నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న మీనాక్షి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి దేవాలయం, వేదాయపాళెంలోని కామాక్షి సమేత శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం, పాత జైలు సమీపంలో ఉన్న ఉమామహేశ్వరాలయం ఇలా నగరంలోని అన్ని శివాలయాల్లో భక్తులు బారులు తీరి కార్తీకదీపాలు వెలిగించారు.

# ఇస్కాన్ మందిరంలో గోవర్ధన పూజలు

నెల్లూరు కొండాయపాళెం రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో గత నెల 29న గోవర్ధన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షులు డాక్టర్ శుకదేవస్వామి మాట్లాడుతూ సంప్రదాయంలో భాగంగా దీపావళి మరుసటి రోజున ఇస్కాన్ అన్నకూటం ఉత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. గో సంరక్షణ ద్వారానే ప్రకృతి సమతుల్యత జరుగుతుందని, శ్రీకృష్ణ భగవానుడు శతాబ్దాల క్రితమే గోవర్ధన పూజను ప్రారంభించారని వివరించారు. అనంతరం మందిరంలో కీర్తనలు ఆలపించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో సంకీర్తన కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక ఉత్సవంలో అమ్మ ఫర్నిచర్ మాల్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేసి సత్కరిస్తున్న జబర్దస్త్ ఫేమ్ కిరాక్ ఆర్పీ.

# పేదలకు అమ్మ... ఇందిరమ్మ

మాజీప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ 35వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నెల్లూరు ఇందిరాభవన్‌లోని ఆమె విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించాడు. అలాగే ఆర్టీసీ, నవాబుపేట సెంటర్‌లలోని ఇందిరమ్మ విగ్రహాలకు కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ పేదప్రజలకు ఇందిరాగాంధీ ఒక అమ్మలా మారిందని, ఆమె చేపట్టిన పథకాలన్నీ కూడా పేదలకోసం ఉద్దేశించినవే అని గుర్తుచేశాడు. బడుగు బలహీనవర్గాల ప్రజలకోసం 20సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేసింది ఆమేనని, బ్యాంకుల జాతీయకరణతో బ్యాంకులను పేదల ముందుకు తెచ్చిందని ఆయన పేర్కొన్నాడు. ప్రపంచదేశాల్లోనే ఉక్కుమహిళగా కీర్తించబడిన ఇందిరమ్మను నేటితరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నాడు. ఇందిరా అంటే ఇండియా, ఇండియా అంటే ఇందిరా అనే స్థాయికి ఆమె ఎదిగారన్నాడు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త పనిచేసి తిరిగి కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలని కోరాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సి.వి.శేషారెడ్డి, సురేష్‌బాబు, రఘురామ్‌ముదిరాజ్, వి.శ్రీనివాసులురెడ్డి, ఫయాజ్, షబ్బీర్, కరీముల్లా, గణేష్, అల్లావుద్దీన్, అమీన్, మోహన్ పాల్గొన్నారు.



ఇందిరమ్మకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

## గోదావరి... కృష్ణ... పెన్నా...

# సంగమ సంబరం

(మొదటి పేజీ తరువాయి)

**రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో మహా జలయజ్ఞానికి త్వరలోనే శ్రీకారం జరగబోతోంది. అన్నదాతలకు ప్రాణప్రదమైన సాగునీటి వసతుల కల్పనే లక్ష్యంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన జలయజ్ఞాన్ని..ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్ రెట్టింపు ఉత్సాహంతో కొనసాగించేందుకు సంకల్పించాడు. రాష్ట్రంలో ఇక కరువన్న మాట వినపడకుండా ఉండేందుకు, రైతన్నలకు నీటి కొరవ లేకుండా చేసేందుకు వేలాదికోట్ల రూపాయల ప్రాజెక్టులను సైతం..ఎంత కష్టమైనాసరే నెలకొల్పేందుకు సమాయత్తమౌతున్నాడు. ఊహించడానికే అలివిగాని ప్రాజెక్టులను, ఎంతో వ్యయభరితమైన కృష్ణా–గోదావరి–పెన్నా నదుల అనుసంధానానికి కూడా సిద్ధమై ప్రణాళిక రూపొందిస్తున్నాడు. అన్నీ కలిసొస్తే.. కేంద్రం కూడా సహకరిస్తే రానున్న రోజుల్లో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండదు. సాగు నీటికి కొదవుండదు. కరువు ఇక కనిపించదు...రైతులకిక ఏ దిగులూ ఉండదు!...**

**గోదావరి–కృష్ణా–పెన్నా నదుల అనుసంధానం!**

**పోలవరం నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు గోదావరి జలాల తరలింపు!..**

**గుంటూరు జిల్లా బొల్లాపల్లి దగ్గర 150 టిఎంసిలతో భారీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటు!..**

ఇలాంటి భారీ ప్రాజెక్టులన్నీ కేవలం మాటలతో అయ్యే పనులు కాదు..వేలాది కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్నవి. అంతేకాదు అహరహం ఎంతో శ్రమపడితే తప్ప జరిగేవి కావు. పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉంటే తప్ప అసలు వీటి జోలికి వెళ్ళలేం. ఒక్క మాటలో చెప్పాలంటే ఇలాంటి భారీ ప్రాజెక్టులను నెలకొల్పాలంటే ముందుగా ఎవరికైనా దమ్ము ధైర్యం ఉండాలి. అసలే రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉన్నా, వేలాది కోట్ల రూపాయలు వ్యయమయ్యే ఇలాంటి ప్రాజెక్టులను చేపట్టడానికి మరింత గుండె ధైర్యం ఉండాలి. అయితే, ఎంత కష్టమైనా నష్టమైనా సరే దేనికీ వెరవని ముఖ్యమంత్రి జగన్.. రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా ఆడిన మాట తప్పకుండా.. మడమ తిప్పకుండా ఈ మహాకార్యాలనిర్వహణకు సమాయత్తం అవుతుండడం పట్ల అటు రైతాంగంలోనూ, ఇటు ప్రజల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. అందులోనూ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిపాదించిన ఉమ్మడి ప్రాజెక్టుకు బదులుగా కృష్ణా–గోదావరి–పెన్నా నదుల అనుసంధానాన్ని జగన్ సొంతంగానే చేపట్టేందుకు సిద్ధం కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. దాదాపు 60వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో, ఏపి ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం..ఈ ప్రాజెక్టులో ఎక్కడా తెలంగాణ భూభాగం తగలకుండా, మొత్తంగా నవ్యాంధ్రకు ఇప్పుడే కాదు..భవిష్యత్తులోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ భారీ ప్రణాళికను అమలుచేయాలన్నది జగన్ లక్ష్యంగా నిర్ణయించుకున్నారన్న విషయం స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో గతనెల 28న రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులను ముఖ్యమంత్రి అధికారులతో కలిసి సుదీర్ఘంగా సమీక్షించారు.

### ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులు...

రైతాంగానికి ప్రాణప్రదమైనవి సాగునీటి ప్రాజెక్టులే. ఆరుగాలం కష్టించే రైతన్నలకు కావాల్సింది సాగునీరే. అదునుకు పదునైన వర్షాలు కురవకుంటే పడిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరే. వ్యవసాయమే ప్రధానమైన మన రాష్ట్రానికి జలమే ప్రాణాధారం. అందుకే రైతులకు సాగునీరందించే ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో నెలకొల్పి పూర్తిచేయాలని, సత్వర ఫలితాలనిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణా వరదనీటిపై ఆధారపడిన జలాశయాలను 40 రోజుల్లోగా నింపడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో కార్యాచరణ ప్రణాళిక తయారవుతోంది. రాష్ట్రంలో ఉన్న మొత్తం జలాశయాల నీటి నిల్వ 982.35 టిఎంసిలు, ప్రస్తుతం వాటిలో 831.46టిఎంసిలు(81.64శాతం) నీరు నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచి, కృష్ణాజలాల వరద ప్రవాహాన్ని ఒడిసిపట్టి, వరద వచ్చిన 40 రోజుల్లోనే గాలేరు–నగరి, తెలుగుగంగ, సోమశిల, కండలేరు తదితర ప్రాజెక్టులను నింపేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించాడు.

### మొత్తం అంచనా వ్యయం 1,40,715 కోట్లు...

రాష్ట్రంలో జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టుల్లో మిగిలిన పనులు పూర్తిచేయడానికి, కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డిపిఆర్) దశలో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేయడానికి సుమారు 1,40,715 కోట్ల రూపాయలు అవసరమని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఏదేమైనా సరే, ఈ పనులన్నీ సకాలంలో పూర్తిచేయాలని, వరద జలాలను ఒడిసిపట్టి.. సముద్రంలోకి వృథాగా వెళ్ళే నీటిని సద్వినియోగం చేసుకోవాలని, సాగునీటి ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని, తద్వారా అటు రైతన్నలకు ఇటు ప్రజలకు సాగునీరు, తాగునీరు కొదవుండకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంబంధిత అధికారులను ఆదేశించడంతో ఈ బృహత్ప్రణాళికల అమలుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

### సొంతంగానే ప్రాజెక్టుల వైపుకు...

తెలంగాణ సీఎం కేసీఆర్‌తో జగన్ నిన్నటి వరకు ఎంతో స్నేహంగా వున్నాడు. జగన్ ఉద్దేశ్యం పొరుగు రాష్ట్రంతో సఖ్యతగా వుండాలని, సమస్యలు రాకుండా చూసుకోవాలని. అయితే జగన్, కేసీఆర్‌తో స్నేహంగా ఉండడంపై కూడా అనేక విమర్శలొచ్చాయి. ముఖ్యంగా ఇద్దరు సీఎంలు కలిసి గోదావరి వరద జలాలను ధుమ్ముగూడెం వద్ద టెయిల్ పాండ్ నిర్మించి సాగర్‌కు మళ్లించాలని చేసుకున్న ప్రతిపాదనపై ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. జగన్ కేసీఆర్ ట్రాప్‌లో పడ్డాడని కూడా ఆరోపణలు చేశారు.

కాని, జగన్ అంత అమాయకుడేం కాదు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అంత సులభంగా రాజీపడేవాడు కాదు. ఈరోజు కేసీఆర్‌తో స్నేహం వుండొచ్చు.... రేపు ఏ విషయంలోనైనా పేచీ రావొచ్చు. అప్పుడు ఉభయ రాష్ట్రాలు కలిసి నిర్మించుకున్న ధుమ్ముగూడెం టెయిల్‌పాండ్ తెలంగాణ పరిధిలో వుంటుంది. అప్పుడు గోదావరి మిగులు జలాలపై నిర్ణయం వారి చేతుల్లో వుంటుంది. అదీగాక ఈమధ్య ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే విషయమై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు జగన్‌ను నొచ్చుకునేలా చేశాయి. ఈ నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో సొంతంగానే ముందుకు వెళ్లాలని, వీలైనంతవరకు కేంద్రప్రభుత్వ సహకారం తీసుకోవాలని జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తన పాలనలో రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న ఇరిగేషన్ ప్రాజెక్టులను, కాలువలను పూర్తి చేసి, ఆయకట్టు విస్తీర్ణాన్ని విపరీతంగా పెంచాలని, నీటి వనరులు సమృద్ధిగా వుంటే వ్యవసాయ రంగమే కాదు, అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని జగన్ నమ్ముతున్నాడు. ఆ దిశగానే భారీ జలయజ్ఞంకు శ్రీకారం చుట్టబోతున్నాడు. ఆయన యజ్ఞం ఫలిస్తే రాష్ట్రమంతా సుభిక్షం... సంతోషమే!

## ప్రతిపక్ష హోదా...

# ఉండేనా? ఊడేనా?



ఆంధ్రప్రదేశ్‌కు ఇంతవరకు 14మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ఇప్పుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పదిహేనో ముఖ్యమంత్రి. గత 14మందిలో ఏ ముఖ్యమంత్రికి పట్టనంత అదృష్టం మాజీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పట్టింది. ఆయన పార్టీని పెట్టలేదు. పార్టీ జెండాను మోయలేదు. పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేయలేదు. తన ప్రజాకర్షణతో పార్టీనెప్పుడూ గెలిపించిన పాపాన పోలేదు. అయినా తెలుగుదేశం పార్టీ వల్ల ఆయన 14ఏళ్ళు ముఖ్యమంత్రిగా, పదేళ్ళు ప్రతిపక్ష నేతగా ఏలాడు. పార్టీని స్థాపించి, అహోరాత్రులు దాని కోసం కష్టపడ్డ ఎన్టీఆర్ సీఎంగా వున్నది కేవలం ఏడున్నరేళ్ళే. ఏం కష్టం చేయకుండానే అంతకు రెండింతల కాలం సీఎం కుర్చీలో వున్నాడు చంద్రబాబు. రాష్ట్ర ముఖ్యమంత్రులుగా చేసినవారిలో అధికకాలం సీఎం రికార్డు చంద్రబాబుదే!

తెలుగుదేశం పార్టీ ద్వారా ఆయనకు ఆ అదృష్టం పడితే, చంద్రబాబు ద్వారా ఆ పార్టీ చరిత్రలో ఎన్నడూ లేనంత దౌర్భాగ్య స్థితికి లోనయ్యింది. ఇంకా కూడా అధఃపాతాళ అంచులను తాకబోతోంది. నిన్నటి ఎన్నికల్లో ఎప్పుడూ లేని ఘోరపరాజయాన్ని ఆ పార్టీ మూటగట్టుకుని కేవలం 23స్థానాలకు పరిమితం కావడం తెలిసిందే! ఇంకో ఆరుసీట్లు తగ్గుంటే ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లేకుండాపోయేది.

### బాబుకు పరీక్ష మొదలైంది...

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన తొలి అసెంబ్లీ సమావేశాలలో ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబులా తాను నీచ రాజకీయాలకు పాల్పడనని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొననని, తాను గేట్లు తెరిస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా మిగలదని హెచ్చరించారు. అప్పుడు చెప్పిన మాటను జగన్ ఇప్పుడు ఆచరణలోకి తెస్తూ చంద్రబాబు ప్రతిపక్షనేత హోదాకు ఎసరుపెట్టాడని తెలుస్తోంది.

### ఆరుగురు జంప్ చేస్తే...

తెలుగుదేశం పార్టీ నుండి ఆరుగురు ఎమ్మెల్యేలు వెళ్లిపోతే తెలుగుదేశంకు ప్రతిపక్ష హోదా పోతుంది. చంద్రబాబుకు ప్రతిపక్ష నేత గౌరవం పోతుంది. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో ఆ కార్యక్రమం మొదలైంది. వంశీ తెలుగుదేశంకు రాజీనామా చేశాడు. వైసిపిలో చేరబోతున్నాడు. వంశీ బాటలోనే ఇంకో ఆరేడుమంది ఎమ్మెల్యేలున్నట్లు తెలుస్తోంది. వీళ్లంతా కూడా ప్రకాశం నుండి శ్రీకాకుళం జిల్లాల మధ్యవున్న ఎమ్మెల్యేలే! త్వరలోనే వీళ్ళు కూడా టీడీపీని వీడడం ఖాయంగా కనిపిస్తోంది.

### చంద్రబాబులా కాదు...

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తన పార్టీలోకి తీసుకోవడంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి కొన్ని విలువలు పాటిస్తున్నాడు. వైసిపిలో చేరాలనుకున్న ఎమ్మెల్యే ముందు టిడిపికే కాదు ఆ పార్టీ ద్వారా సంక్రమించిన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయాలి. పార్టీలో చేరాక పార్టీ అధిష్టాన నిర్ణయం ప్రకారం నడుచుకోవాలి. జగన్ కూడా రాజీనామా చేసిన ఎమ్మెల్యేలకు ఉపఎన్నికల్లో అవే స్థానాలను వారికే కేటాయించాలని భావించడం లేదు. రాజీనామాలు చేసొచ్చిన వారికి ఎమ్మెల్సీలో లేదా నామినేటెడ్ పదవులో ఇచ్చి, మొన్న ఎన్నికల్లో ఎవరైతే వైసిపి తరపున పోటీ చేసి ఆయా స్థానాలలో ఓడిపోయివుంటారో వారికే మళ్ళీ సీట్లు కేటాయించి గెలిపించాలనే ఆలోచనలో వున్నట్లు తెలుస్తోంది. ఇలా చేయడం ద్వారా ఆయన తనను నమ్ముకున్న వాళ్లకు న్యాయం చేయడంతో పాటు పార్టీలోకి వచ్చిన వారి గౌరవం కాపాడినవాడు కూడా అవుతాడు.

గత ఐదేళ్ళలో చంద్రబాబు ఈ పద్ధతికి భిన్నంగా వ్యవహరించడం తెలిసిందే! వైసిపి నుండి ముగ్గురు ఎంపీలను, 27మంది ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనడమే కాకుండా, వారిలో నలుగురికి మంత్రి పదవులివ్వడం ద్వారా విలువలను గోతితీసి పాతిపెట్టాడు.

### అడ్డదారిలో కానిది...

చంద్రబాబు అడ్డదారుల్లో విలువలను తుంగలో తొక్కి వైసిపిని లేకుండా చేయాలనుకున్నాడు. కాని, ఆయనకు అది సాధ్యం కాలేదు. జగన్ మాత్రం అడ్డదారులు తొక్కకుండా రాజమార్గంలోనే విలువలు పాటిస్తూ చంద్రబాబు రాజకీయ జీవితానికి చెదలు పట్టించబోతున్నాడు. త్వరలోనే ఇది జరగబోతుంది!?

# చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఒక దీపావళి!

నెల్లూరు జిల్లా ప్రజలు దీపావళి పండుగను గతనెల 27న ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కుల,మతాలకు అతీతంగా టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కేదారేశ్వర వ్రతం, లక్ష్మీ పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లాలో దాదాపు రూ.20కోట్లకు పైగా టపాకాయల వ్యాపారం జరిగినట్లు సమాచారం. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వ్యాపారం సన్నగిల్లింది. ఇటీవల కురిసిన వర్షాలు టపాకాయల వ్యాపారాన్ని దెబ్బతీశాయి. కేవలం రెండు రోజులు మాత్రమే వ్యాపారం జరిగింది. నెల్లూరు నగరంలోని అన్ని డివిజన్లలో భారీగా బాణాసంచా కాల్చారు. చిన్నారులు, యువత పలు సెంటర్లలో గుంపులుగా చేరి టపాకాయలు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. శివాలయాల్లో స్వామి వార్లకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవార్లకు అష్టోత్తర సహస్రనామ పూజలు నిర్వహించారు. నగరంలోని ఆచారి వీధి, మండపాలవీధి, చిన్నబజారు బంగారు వ్యాపారులు, మార్వాడీలు దీపావళి వేడుకలను కనులపండువగా జరుపుకున్నారు. ధనలక్ష్మీ పూజలు చేసి కొత్త వ్యాపార పుస్తకాలు ప్రారంభించారు. అనంతరం బాణాసంచా కాల్చి ఖాతాదారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.



## పెనుశిల లక్ష్మీనృసింహునికి

# బంగారు గరుడసేవ

పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామికి గతనెల 28న వైభవంగా బంగారు గరుడసేవ నిర్వహించారు. శ్రీవారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని విశేషపూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి అలంకార మండపంలో స్వామివారికి బంగారు గరుడ వాహనసేవ, అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు.

# శ్రద్ధాంజలి



జననం: 18.01.1946 మరణం: 05.11.2017

స్నేహశీలి, మృదుస్వభావి,
మంచి మనసున్న మహామనీషి, మానవతావాది

## ఆదాల రాఘవరెడ్డి గారు

పరమపదించి తేది. 05.11.2019 నాటికి
రెండేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

భార్య
**ఆదాల అరుణ**
కుమార్తె
**ఆదాల సాయి అపర్ణ**

కుమారుడు - కోడలు
**ఆదాల వంశీకృష్ణ - రచన**
మనుమరాళ్ళు
**సాయి అనిక, సాయి అవని**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com